Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

మంగళవారం, 10 సెప్టెంబర్ 2024 విజయవాడ సంపుటి: 01 - సంచిక : 91 పేజీలు : 12 వెల రూ.6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



**వరద బాధితులకు ముఖ్యమంత్రి అండ**

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

# వరద బాధితులకు అండగా ఉంటాం

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడి

- 9 రోజులపాటు చేసిన పనులపై సంతృప్తిగా ఉన్నాం
- వరద బాధితులకు మనోధైర్యం ఇవ్వాలనేదే మా లక్ష్యం
- బుడమేరు నుంచి కొల్లేరుకు నీరు వెళ్లకుండా కబ్జాలు చేశారు
- అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు శాపాలుగా మారాయి
- జటిలమైన సమస్యను సమన్వయంతో పరిష్కరిస్తాం
- ఆప్కో, ఇతర సంస్థల వద్ద వస్త్రాలు తెచ్చి బాధిత ప్రజలకు పంపిణీ చేస్తాం



**అమరావతి-సూర్య వాస్తవం**

'ప్రజల కోసం తాను జీవితాంతం పని చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తొమ్మిదోరోజు విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం స్వయంగా బాధితులకు అందుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బాధితుల బాధలను చూసి, కష్టాలు విని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. వరద ప్రభావిత

- మిగతా 2లో..



లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత

## ప్రజలు బీజేపీకి భయపడటం లేదు

**డల్లాస్-సూర్య వాస్తవం:** ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రజలు బిజెపికి, ప్రధాని నరేంద్రమోడీకి భయపడడం లేదు అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. లోక్‌సభ ఎన్నిలక తర్వాత రాహుల్‌గాంధీ మొట్టమొదటిసారి విదేశీ పర్యటనకు వెళ్లారు. అమెరికాలోని టెక్సాస్‌లోని

- మిగతా 2లో..

అబుదాబి యువరాజు అల్ నహ్యాన్‌కు

## భారత్ ఘన స్వాగతం



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబుదాబి యువరాజు షైక్ ఖలిద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ రెండు రోజుల భారత్ పర్యటన నిమిత్తం ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈయనకు భారత కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖామంత్రి పీయుష గోయల్ విమానాశ్రయంలో

- మిగతా 2లో..

17కి తాజా

## నివేదికనివ్వాలి



**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం:** ఇటీవల కలకత్తాలో ఆర్‌జి కర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థిని దారుణ హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు వ్యతిరేకంగా వైద్యుల భద్రతపై దేశవ్యాప్తంగా డాక్టర్స్ ఆందోళనలు చేపట్టారు. ఈ కేసుపై నేడు సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణ సందర్భంగా

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

కాసేపట్లో తీరం దాటనున్న

## వాయుగుండం

- ఏపీలో అతి భారీ వర్షాలు



**విశాఖ-సూర్య వాస్తవం**


తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాను హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఇప్పటికే ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అయితే, కాసేపట్లో పూరీ దగ్గర తీవ్ర వాయుగుండం తీరం దాటనుంది. భూ ఉపరితలంపై సోమవారం అర్ధరాత్రి వరకు తీవ్ర వాయుగుండంగా కొనసాగుతూ క్రమేపీ బలహీనపడుతుందని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.. ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని , విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో అకస్మాత్తుగా వరదలు సంభవించే అవకాశం ఉందని తెలిపింది.. ఇక,

- మిగతా 2లో..

వరదలో నష్టపోయిన

## ప్రతి ఇంటికీ నష్టపరిహారం

- మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి-సూర్య వాస్తవం**

వరద కారణంగా నష్టపోయిన ప్రతి ఇంటికీ నష్టపరిహారమిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్న విధానాలు, వ్యవహరిస్తున్న తీరును ప్రశంసిస్తూ జాతీయస్థాయిలో చర్చ జరుగు తోందని రాష్ట్ర గఅహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గత 9 రోజులుగా విజయవాడ చరిత్రలో ఎన్నడూ చూడని ఉపద్రవం ముంచుకొచ్చిందన్నారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం తర్వాత రికార్డు స్థాయిలో వరదలు రావడం జరిగిందని, ఇలాంటి విపత్కర పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం దీటుగా ఎదుర్కొంటోందన్నారు. ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవడంలో వయసు, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా బస్సులోనే ఉంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చొరవ, కఅషి, పనితీరు భవిష్యత్ తరాలకు, తనలాంటి ప్రజాప్రతినిధులకు ఆదర్శమని కొనియాడారు. వరదల నేపథ్యంలో ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికార, పార్టీ

- మిగతా 2లో..

### లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత

## ప్రజలు బీజేపీకి భయపడటం లేదు

(మొదటిపేజీ తరువాయి)

డల్లాస్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కొద్ది నిమిషాల్లోనే భారతదేశంలో బిజెపి అన్నా, ప్రధాని మోడీ అన్నా దేశ ప్రజల్లో భయం పోవడం మేము చూశాము. ఈ ఎన్నికల్లో సాధించిన విజయం రాహుల్ గాంధీదో, లేక కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలో కావు. ప్రజాస్వామ్యం అంటే ఏంటో తెలిసిన భారత ప్రజలు సాధించిన విజయాలు అవి' అని ఆయన అన్నారు. కాగా, ఈ సందర్భంగా రాహుల్ ఆర్‌ఎస్‌ఎస్ పైనా మండిపడ్డారు. 'భారతదేశం అనేది హిందుత్వ దేశంగా ఉండాలనేది ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన. కానీ భారత్‌లో భిన్నమతాలు ఉంటాయి. కులం, భాష, మతం, సంప్రదాయం లేదా చరిత్రతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ కలల్ని సాకారం చేసుకునేందుకు అనుమతివ్వాలని మేము కోరుకుంటున్నాము. అయితే భారత ప్రధాని మోడీ మాత్రం ఎన్నికల సమయంలో ప్రత్యేకించి రాజ్యాంగంపై దాడి చేశారు. ఆ విషయాన్ని దేశ ప్రజలందరూ అర్థం చేసుకున్నారు. అందుకే అది ఎన్నికల ఫలితాల్లో రుజువైంది. బిజెపి మన సంప్రదాయంపైనా, భాషపైనా, రాష్ట్రాలపైనా, చరిత్రలపైనా దాడి చేస్తుంది. ఇక్కడ ప్రధానంగా ప్రజలు అర్థం చేసుకున్నదేమిటంటే.. భారత రాజ్యాంగంపై దాడి చేసే ఎవరైనా మన మత సంప్రదాయంపై కూడా దాడి చేస్తారు అని' రాహుల్‌గాంధీ అన్నారు.

## అబుదాబి యువరాజు అల్ నహ్యాన్‌కు భారత్ ఘన స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు రావడం ఇదే తొలిసారి. చారిత్రాత్మక బంధంలో ఇదొక మైలురాయి' అని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, భారత్ పర్యటనకు అబుదాబి యువరాజుతోపాటు, యుఎఇ ప్రభుత్వానికి చెందిన పలువురు మంత్రులు, వ్యాపార ప్రతినిధి బృందం కూడా వచ్చింది. భారత్ పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని మోడీతో అబుదాబి యువరాజు భేటీ కానున్నారు. రేపు ముంబయిలో జరిగే బిజినెస్ ఫోరంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఇరు దేశాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొనున్నారు. షేక్ ఖలిద్ పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది. ఇంధనం, కనెక్టివిటీతో సహా అనేక రంగాలలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడనుందని భారత విదేశీ వ్యవహారల మంత్రిత్వశాఖ తెలిపింది. 2015లో ప్రధాని మోడీ యుఎఇ పర్యటనకు వెళ్లారు. ఆ తర్వాత రెండు దేశాల కరెన్సీల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఫిబ్రవరి 2022లో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, 2023 జులైలో లోకల్ కరెన్సీ సెటిల్‌మెంట్ (ఎల్‌సిఎస్)పై ఒప్పందాలపై భారత్, యుఎఇ దేశాలు సంతకాలు చేశాయి. భారత్ మద్దతుతో బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండయా, చైనా, దక్షిణాఫ్రికా)లో చేరింది.

## 17కి తాజా నివేదికనివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టు బాధితురాలి మృతదేహానికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా నుండి తక్షణమే తొలగించాలని ఆదేశించింది. అనధికార వ్యక్తులను ఆసుపత్రిలోకి అనుమతించకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సిబిఐని కోరింది. అలాగే ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 14 గంటలు ఎందుకు ఆలస్యం జరిగిందని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ఎఫ్ఐఆర్ ఆలస్యానికి గల కారణాలతో అదనపు అఫడవిట్‌ను దాఖలు చేయడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును సమయం కోరింది. ఆసుపత్రిలోని మొత్తం సీసీటివి ఫుటేజీని కలకత్తా పోలీసులు సిబిఐకి అప్పగించారా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో సిబిఐ విచారణను కొనసాగించాలని, సెప్టెంబర్ 17వ తేదీన ఈ కేసుకు సంబంధించి తాజా నివేదికను దాఖలను చేయాలని సుప్రీంకోర్టు సిబిఐని ఆదేశించించింది.

### కాసేపట్లో తీరం దాటనున్న

## వాయుగుండం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటించింది.. ఇదే సమయంలో.. కాకినాడ, ఎన్టీఆర్, ఏలూరు, కఅష్ణ.. ఉభయ గోదావరి జిల్లాలకు ఎల్లో వార్నింగ్ ఇచ్చింది. గత 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి.. చింతపల్లిలో 13 సెంటీమీటర్లు, పూసపాటి రేగ 10, వైజాగ్ ఎయిర్ పోర్ట్ 09 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్టు విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం వివరించింది. రాష్ట్రంలోని అన్ని పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికలను విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం జారీ చేసింది.

### వరదలో నష్టపోయిన

# ప్రతి ఇంటికీ నష్టపరిహారం

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం, సచివాలయ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరూ నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్య పరిష్కారం దిశగా పాటుపడుతున్నారన్నారు. ఒకవైపు గత వారం రోజులుగా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఉన్న పరిస్థితి.. మరో వైపు అల్పపడీన ప్రభావంతో మళ్లీ వర్షాలు పడుతున్నాయన్న వార్తలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.
సహాయక కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సాయం అందడంలో ఏవైనా తప్పులు ఉంటే ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి అందరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహారం వఅథా అయినా ఫర్వాలేదు కానీ బాధిత ప్రజలందరికీ సాయం అందాలన్నదే తమ తాపత్రయం అన్నారు. రోజుకు 6 నుండి 8 లక్షల అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ప్యాకెట్లు బాధితులకు అందిస్తున్నామని వివరించారు. బోట్లు, వాహనాలు, యంత్రాంగం వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నామన్నారు.

కొన్ని చోట్ల హెలికాప్టర్ల ద్వారా బాధితులకు ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు భరోసా కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వర్షాల నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశముండటంతో ప్రభుత్వం ముందే అప్రమత్తమై 4, 5 వేల మంది సిబ్బందితో శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతుందన్నారు. దాదాపు 100-120 ఫైర్ ఇంజిన్ల పంపులతో ఎప్పటికప్పుడు రోడ్లు, బాధితుల గఅహాల్లో బురద తొలగించి శుభ్రం చేస్తున్నామన్నారు. బురదను తొలగించే పనిలో ప్రభుత్వం ఉంటే కొందరు ప్రభుత్వంపై బురదజల్లేలా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నిర్మాణాత్మక సలహాలు, సూచనలు అందివ్వాలని, విషం కక్కే వార్తలతో తమ పత్రికల్లో విష ప్రచారాలు చేయడం తగదన్నారు. ప్రజాప్రతినిధులతో మాట్లాడటానికి ఇబ్బంది ఉంటే చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు సమస్యలు చెప్పవచ్చని సూచించారు. గత ప్రభుత్వానికి కాలువలో వెలికి తీసిన మట్టిని అమ్ముకోవడంలో ఉన్నంత శ్రద్ధ అదే కాలువల రిపేర్ కు నిధులు కేటాయించడంలో లేదని ఆరోపించారు.

గత ప్రభుత్వం కాలువల్లో మట్టి తవ్వకుని అమ్ముకున్నారే తప్ప డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేద్దామని, గండ్లు పూడుద్దామని ఆలోచించలేదన్నారు. కనీసం కబ్జాకు గురవుతున్నా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర అభివఅద్ధి, భవిష్యత్ కోసం ఎలాంటి ఆలోచన చేయలేదన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. ఇప్పుడిప్పుడే వరద ఉధఅతి తగ్గుతోందని త్వరితగతిన శానిటేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. శానిటేషన్ పనితీరును ఈ సందర్భంగా ప్రజలు మెచ్చుకున్నారు. తాను కఅష్ణలంక ప్రాంతంలో పర్యటించినప్పుడు ప్రజలు సహాయక చర్యలపై సంతఅప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వంపై నమ్మక ముందన్నారు. వరదలు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన వివరాలను వెల్లడిస్తామన్నారు. వరద నష్టం అంచనా వేయటానికి మొత్తం 1700 ఎన్యూమరేషన్ బఅందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్, వార్డు అసిస్టెంట్, పోలీసుతో కూడిన బఅందం ఎన్యూమరేషన్ ప్రక్రియలో పాల్గొంటుందన్నారు. ప్రతి సచివాలయంలో ఒక ఐఏఎస్ అధికారి, జిల్లా స్థాయి అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధి పర్యవేక్షిస్తారన్నారు. ప్రాథమికంగా 2,50,000 ఇళ్లు దెబ్బతిన్నాయని, నష్టం వాటిల్లిందని అంచనా వేశామన్నారు. నష్టం అంచనా నమోదుకు అధికారులు ప్రత్యేక యాప్ రూపొందించారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్యుమరేషన్ సమయంలో ఇంట్లో ఎవరూ లేకుంటే తర్వాత అయినా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్యూమరేషన్ తమ గఅహం, పేరు రాకపోతే స్థానిక ప్రజాప్రతినిధిని కలవాలని సూచించారు. వివరాలు సేకరించి యాప్ లో నష్టపోయిన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కఅతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన రైతాంగం తీవ్రంగా నష్టపోవడం బాధ కలిగించే అంశమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందన్నారు. గన్నవరం, నూజివీడు, ముదినేపల్లి లాంటి ప్రాంతాల్లో పొలాలు, గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయని, సంబంధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే బాధ్యతతో వ్యవహరించకుండా కొందరు బురద చల్లుతున్నారని మంత్రి పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వరద బాధితులకు

# అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లోని స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ఉదయం నిద్ర లేచింది మొదలు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విజయవాడలో వరదలపై యుద్ధం చివరి దశకు వచ్చిందని తెలిపారు. ఈ యుద్ధం రేపటితో ముగిస్తే.. ఇక రాష్ట్ర పునర్నిర్మాణంపై దృష్టి పెడతామన్నారు. 9 రోజుల్లో విజయవాడ నగరాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చామన్నారు. సింగ్‌నగర్‌లో వరద వచ్చిన తొలి రోజు తాను పర్యటించినప్పటికీ, ఇప్పటి పరిస్థితుల్లో చాలా పురోగతి కన్పించిందన్నారు. తొలి రోజు ప్రజలు చాలా బాధగా ఉండటం చూశానని, 9వ రోజు తమ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న పూర్తి నమ్మకం చూశానని తెలిపారు. ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో చాలా గృహాలు దెబ్బతిన్నాయని, ఇళ్లలో చెడిపోయిన వస్తువులను బాగు చేసేందుకు అర్బన్ కంపెనీకి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. వస్తువులు రిపేర్ చేసేందుకు అవసరమైన ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ తదితరులు కావాలంటే ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వినియోగించడం నేర్చుకోవాలని సూచించారు. అర్బన్ యాప్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచుతామన్నారు. తద్వారా ఇంటివద్దే అన్ని సేవలు అందుతాయన్నారు.
వరదల వల్ల కట్టు బట్టలు తప్ప అన్నీ పోగొట్టుకోవడం శోచనీయమన్నారు. ఆప్కో, ఇతరత్రా సంస్థల దగ్గర ఎన్ని దుస్తులు ఉంటే అన్నీ తెప్పించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంట్లో ఉండే వారికి తలా ఒక జత దుస్తులు అందజేస్తామని హామీనిచ్చారు.. ఎప్పుడూ లేని విధంగా ఇళ్లలో ఫైర్ ఇంజిన్లతో బురద తొలగిస్తున్నామన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. విజయవాడను ఫైలట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు.
ముంపు ప్రాంతాల్లో ప్రజలకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేసామని తెలిపారు.



సకాలంలో నిత్యావసర వస్తువులు, డ్రైఫుడ్ అందించామన్నారు. కూరగాయలు రూ.2, రూ.5, రూ.10కే ఇస్తున్నామన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు శక్తిని, భరోసానిస్తున్నామన్నారు. విపత్తు సమయంలో డబ్బుల గురించి కాదు మానవత్వం గురించి, మనిషి గురించి ఆలోచిస్తున్నామన్నారు. చివరి వ్యక్తికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌కు ప్రజలు స్పందించాలని కోరారు. ప్రజలు అభిప్రాయం తెలిపితేనే తమకు వాస్తవాలు తెలుస్తాయని తద్వారా నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

బుడమేరుపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో లక్షలాది మంది ప్రజలు బాధలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాధినేత చేసిన పాపాల ప్రజలకు శాపాలుగా మారాయని ఆరోపించారు. బుడమేరు నుంచి కొల్లేరుకు నీరు వెళ్లకుండా కబ్జాలు చేశారని తెలిపారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, నారా లోకేష్ లు బుడమేరు గండ్లు పూడ్చే కార్యక్రమం చేపట్టి విజయంవతంగా పూర్తి చేశారన్నారు. ఇతర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, పోలీసులంతా అక్కడే ఉండి రేయింబవళు పనిచేశారన్నారు.

బోట్ల ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్రకు కొందరు పన్నాగం పన్నారని విమర్శించారు. భారీ బోట్లకు లంగర్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తమ అనుకూల మీడియా ద్వారా ప్రతిరోజు తమపై విషం చిమ్మే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు.
గత ఐదేళ్లలో ఎలాంటి పాలన జరిగిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. నేరస్థులను నమ్మితే మాత్రం నాశనమే ఎదురవుతుందన్నారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అప్పులు ఇచ్చే పరిస్థితి కూడా లేదని తెలిపారు. ప్రభుత్వానికి కూడా ఇబ్బందులు ఉన్నాయని అయినప్పటికీ ప్రజల కోసం పని చేస్తున్నామన్నారు. సకాలంలో ఎవరికైనా సాయం అందకపోయినా ఆందోళన చెందవద్దని తెలిపారు.
ప్రజలంతా తిరిగి కోలుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు నిలదొక్కుకునేలా పని చేస్తామన్నారు. ఏ ఒక్క వ్యక్తికి అన్యాయం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు టెక్నాలజీని వినియోగించాలని కోరారు. టెక్నాలజీతో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మన జీవితంలో టెక్నాలజీ వల్ల సమూల మార్పులు వస్తాయని అందుకే ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వాడకం ద్వారా తమ పనులన్నీ అయ్యే విధంగా శ్రీకారం చుడతామన్నారు. ఇంట్లో ఉంటూనే ప్రపంచంతో మమేకం అవ్వొచ్చు... తక్కువ సమయం పని చేసి ఎక్కువ ఉపాధి సృష్టించుకోవచ్చన్నారు.. కష్టపడి సంపాదించడం రోజూ చేసేదే కానీ తెలివితేటలతో సంపాదిస్తే మరింత సంపాదించవచ్చని సూచించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు మంచి సేవలు అందించాలన్నదే మా తపన.. భవిష్యత్ లో ఇలాంటి సమస్య పునరావృతం కావకుండా చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## మళ్లీ మొదటికొచ్చిన మణిపూర్


కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలు కాస్తా గతేడాది ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌ను ఏ విధంగా రణరంగంగా మార్చాయో అందరికీ తెలిసిందే. వందల మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. అయితే గత కొంత కాలంగా మణిపూర్‌లో డ్రోన్ దాడులు సంచలనం సృష్టించగా.. తాజాగా జరిగిన ఓ ఘటన మళ్లీ హింసాత్మక ఘటనలకు ఆజ్యం పోశాయి. తాజాగా జిరిబం జిల్లాలో శనివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న కాల్పుల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గత వారం రోజులుగా మణిపూర్‌లో హింస చెలరేగుతుండటం మరోసారి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిరిబం జిల్లాకు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చొరబడిన మిలిటెంట్లు.. గాఢనిద్రలో ఉన్న ఓ వ్యక్తిని కాల్చి చంపేశారు. అనంతరం విషయం తెలుసుకుని పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు మిలిటెంట్లతో పాటు ఓ సాధారణ పౌరుడు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. చురాచాంద్‌పూర్‌లో మిలిటెంట్లకు చెందిన 3 బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఇక ఇటీవల బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను చురాచాంద్‌పూర్ నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది. కొత్త తరహా దాడులతో రెచ్చిపోతున్నారు కుకీ తీవ్రవాదులు . డ్రోన్లు , రాకెట్ దాడులతో రాజధాని ఇంఫాల్ లోని ప్రముఖ నాయకుల ఇళ్లను వాళ్లు టార్గెట్ చేయడం తీవ్ర కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన సైన్యం యాంటీ డ్రోన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. కేంద్రం మణిపూర్‌లో తాజా పరిస్థితిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది. డ్రోన్లు , రాకెట్‌లను వాళ్లు ప్రయోగించడం తీవ్ర కలకలం రేపుతోంది. కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా మణిపూర్‌లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. డ్రోన్ దాడులకు కుకీ తీవ్రవాదులే కారణమని మెయితీ వర్గం ఆరోపిస్తోంది. సరిగ్గా పదహారు నెలల క్రితం మణిపూర్ మంటల్లో రగిలిపోయింది. గతేడాది మే 3న చెలరేగిన అల్లర్లు దాదాపు సంవత్సరం పాటు తీవ్రమైన ఆందోళనకు కారణమయ్యాయి. కొన్ని రోజులు ఈ పరిస్థితులు కాస్త సద్దుమణిగాయని అనుకుంటున్న తరుణంలో.. మణిపూర్ అంతర్యుద్ధం కాస్తా యుద్ధంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో మాదిరి డ్రోన్లతో రాకెట్ దాడులకు తెగబడుతున్నారు మిలిటెంట్లు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాకు సమీపంలోని రెండు ప్రదేశాల్లో జనావాసాలపై బాంబులు వేయడానికి ఉగ్రవాదులు డ్రోన్‌లను ఉపయోగించారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో రాత్రుళ్లు అందరూ లైట్లు ఆఫ్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మణిపూర్‌లోని బిష్ణుపూర్, ఇంఫాల్ తూర్పు జిల్లాల శివార్లలోని నివాసితులు డ్రోన్‌ల దాడులకు భయపడుతూ బతుకుతున్నారు. సెప్టెంబర్ 6న బిష్ణుపూర్ జిల్లాలో మిలిటెంటు లాంగ్ రేంజ్ రాకెట్‌లను మోహరించారు. మణిపూర్ మొదటి ముఖ్యమంత్రి మైరెంబమ్ కోయిరెంగ్ నివాసంపై రాకెట్ దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఒక సీనియర్ సిటిజన్ ప్రాణాలు కోల్పోగా.. బిష్ణుపూర్ జిల్లా మొయిరాంగ్ ఖోయిరు లైకైలో ఆరుగురు పౌరులు గాయపడ్డారు. కొండ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించేందుకు పోలీసు బృందాలు, అదనపు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ముల్సాంగ్ గ్రామంలో రెండు బంకర్‌లు, చురచంద్‌పూర్‌లోని లైకా ముల్సౌ గ్రామంలో ఒక బంకర్‌ను భద్రతా బలగాలు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. అక్కడ ఎస్పీతో సహా బిష్ణుపూర్ జిల్లా పోలీసు బృందాలు అనుమానిత కుకీ మిలిటెంట్లు కాల్పులు జరిపిన ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే, పోలీసు బృందం గట్టిగా ప్రతిఘటించి దాడిని తిప్పికొట్టినట్లు అధికారులు చెబుతున్నారు. డ్రోన్లతో జరిగే దాడులను అడ్డుకోడానికి భారత వైమానిక పెట్రోలింగ్‌కి చెందిన మిలటరీ హెలికాప్టర్‌ను మోహరించారు. శాంతిభద్రతలను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి భద్రతా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న అధికారులు, ఎలాంటి ఆకస్మిక పరిస్థితులు తలెత్తినా స్పందించేందుకు అవసరమైన ప్రత్యేక బలగాలను సిద్ధం చేస్తున్నారు. మణిపూర్‌లో భారీ మిలిటెంట్ సమూహాల కదలికలపై నిఘా ఉంచడానికి భద్రతా బలగాలు హై అలర్ట్‌ను ప్రకటించాయి. బిష్ణుపూర్ జిల్లాలో, ఆకాశంలోకి లైటింగ్ రౌండ్లు కాల్పులు జరుపుతున్నారు. యుద్ధాన్ని తలపించే ఈ పరిస్థితికి ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారు. ఈ గందరగోళం మధ్య భద్రతా బలగాలు కాల్పులు జరిపారా లేదంటే మిలిటెంట్లు కాల్పులు జరుపుతున్నారో తెలియక ప్రజలంతా బిక్కు బిక్కుమంటున్నారు. మరోవైపు, భద్రతా బలగాలు మిలిటెంట్ల బంకర్లను ధ్వంసం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే, మణిపూర్‌లో డ్రోన్ ఆయుధాన్ని ఉపయోగించిన మొదటి సంఘటన సెప్టెంబర్ 1న ఇంఫాల్ పశ్చిమ జిల్లా కౌత్రుక్ గ్రామంలో జరిగింది. ఈ దాడిలో మిలిటెంట్లు తుపాకులు కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆ తర్వాత రోజు, దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంజామ్ చిరాంగ్‌లో మరో డ్రోన్ దాడి జరగ్గా ఇందులో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇలా వరుస దాడులతో మణిపూర్ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే, మణిపూర్‌లో డ్రోన్లు ఎగరడం ఇటీవల కాలం షారామూమూలు అయ్యింది. కుకీ-జో తెగలు, మెజారిటీ మైతేయిల మధ్య గతేడాది వివాదం మొదలైనప్పటి నుండీ కెమేరా డ్రోన్లు ఎగురుతుండటం కనిపిస్తూనే ఉంది. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించడానికి అధికారులతో పాటు.. యూట్యూబర్లు కూడా డ్రోన్ కెమేరాలను వినియోగిస్తున్నారు. భద్రతా దళాల నిఘా డ్రోన్లు కూడా తిరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పుడు డ్రోన్లతో లాంగ్ రేంజ్ రాకెట్లతో గ్రెనేడ్లను వదలడం ఆందోళన కలిగిస్తోంది. కుకీ చొరబాటుదార్లు వీటిని ప్రయోగిస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కుకీ తెగలు నివాసముండే ప్రాంతాల నుండి ఈ డ్రోన్లు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇవి నిజంగానే కుకీ మిలిటెంట్లు పంపిస్తున్నరా లేదంటే దీని వెనుక బయటి శక్తులు కుట్ర దాగుందా అనేది అర్థం కావట్లేదు. మైతేయి తెగకు రిజర్వేషన్లు కల్పిస్తూ మణిపూర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఏడాది క్రితం మణిపూర్‌లో హింస రాజుకుంది. అనాలోచితంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తోడు.. చారిత్రిక శత్రుత్వం తోడయ్యి.. వందల మంది ప్రాణాలను బలిగొన్న ఈ హింస 2023 మే 3న మొదలైయ్యింది. స్విట్జర్లాండ్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన మణిపూర్ సెగలు యావత్ దేశాన్ని కలవరానికి గురిచేశాయి. అలాంటి ఆందోళనల మధ్య ఇప్పుడు డ్రోన్ల దాడులు మణిపూర్‌లో మరింత హింసకు దారితీస్తాయనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. అందులోనూ, డ్రోన్ల ద్వారా బాంబులు వేయడాన్ని దాటేసి.. డ్రోన్లతో రాకెట్‌లను ప్రయోగించడమంటే.. అది ఆధునిక మిలటరీ పరికరాలు, సాయం లేనిదే సాధ్యం కాదంటున్నారు భద్రతాదళాలు. నిజానికి, ఈ డ్రోన్ల దాడుల గురించి కొన్ని రోజులుగా అనుమానాలు వ్యక్తమవుతూనే ఉననాయి. గత నవంబర్‌లో ఇంఫాల్ విమానాశ్రయం వద్ద భారీ డ్రోన్ ఒకటి ఎగురుతున్నట్లు గుర్తించారు. దీని కోసం ఏకంగా రాఫెల్ యుద్ధ విమానాన్ని కూడా రంగంలోకి దించారు. అయితే, ఇంత ఆధునిక డ్రోన్లను స్థానికంగా తయారుచేస్తున్నట్లు కూడా అనుమానాలు లేకపోలేదు. ఇటీవల డ్రోన్ల తయారీకి అవసరమైన పరికరాలతో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని అసోం స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మణిపూర్‌లో తీవ్రవాద బృందాలకు చేరవేయడానికే వాటిని ఆ వ్యక్తి కొనుగోలు చేసాడని పోలీసులు అనుమానించారు. అది జరిగిన కొన్ని రోజులకే? అత్యాధునిక టెక్నాలజీ డ్రోన్‌లకు వాడే బ్యాటరీలతో మణిపూర్‌లోకి ఎంటర్ అయిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ బ్యాటరీలను సినిమా నిర్మాణంలో వినియోగించడానికి తీసుకొస్తున్నట్లు సినీ నిర్మాతల సంఘం వెల్లడించింది. అతని అరెస్ట్‌ను ఖండించింది. అయితే, ఇలాంటి డ్రోన్ టెక్నాలజీ మణిపూర్‌లోకి రావడం అల్లర్లలో ఉగ్రవాద శక్తుల ప్రాభల్యాన్ని పెంచుతుందనడానికి సూచనగా పోలీసులు పరిగణిస్తున్నారు. దీని వెనుక బయటి శక్తుల హస్తం కూడా ఉందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ

## -నేడు ఆమె వర్ధంతి

హైదరాబాద్ -సూర్య వాస్తవం

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ. నిజాం నవాబుకూ, ఆయన తొత్తులైన భూస్వాములకూ వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తన ఇల్లునే కార్యాలయంగా మార్చిందామె. చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మ గా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత. వీరు 1919లో జన్మించి 10 సెప్టెంబరు 1985లో పరమపదించారు. 1919 లో వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామం లో ఓరుగంటి మల్లమ్మ, సాయిలు కు నాలోగో సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించింది. పాలకుర్తి కి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు ,ఇద్దరు కుమార్తెలు . ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా'అని ఉత్పత్తికులాల (బీసీ కులాల) చేత పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది. పండించిన పంటనాది. తీసుకెళ్లడానికి దొరెవ్వడు. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రె?తాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ. మల్లంపల్లి భూస్వామి కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు.




పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ కోర్టులో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది. అయిలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్ పట్వారిని పిలిపించుకొని, అయిలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, పండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వందమందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు. 'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది. నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధె?ర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన అయిలమ్మ సెప్టెంబర్ 10, 1985 న అనారోగ్యంతో మరణించింది.

# నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

## -ఆత్మహత్యలు వద్దు.. నిండైన జీవితం ముద్దు




ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10న జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణకోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003వ సంవత్సరం నుండి ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది.. ఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలుకొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించబడింది. ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటు చేయాలని, ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. 2014లో విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్య నివేదిక ప్రకారం, తక్కువ ఆదాయం ఉన్న దేశానికి జాతీయ ఆత్మహత్యల నివారణ ప్రణాళిక లేదని, తక్కువ-మధ్యతరగతి ఆదాయపు దేశాలలో 10% కన్నా తక్కువగా, ఎగువ-మధ్య-అధిక ఆదాయ దేశాలలో దాదాపు మూడవ వంతుగా ఉన్నట్లు నివేదించింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా మానసిక వైద్య నిపుణులచే సదస్సులు నిర్వహిస్తారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం గుర్తుగా పసుపు, నారింజ రంగు రిబ్బన్లను చేతులకు కట్టుకుని ఆత్మహత్యలు వద్దు - నిండైన జీవితం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ, అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు.





## సిద్ధవటం మండలానికి 39.6 టన్నులు యూరియా మంజూరు

**సిద్ధవటం - సూర్యవాస్తవం:** సిద్ధవటం మండలానికి 39.6 టన్నులు యూరియా మంజూరయినట్లు మండల వ్యవసాయ అధికారి కే. రమేష్ రెడ్డి తెలిపారు. రైతు సేవ కేంద్రాలు అయిన మాధవరం-2 కు 9.8, పెద్దపల్లికి 9.8,సిద్ధవటానికి 19.8 మెట్రిక్ టన్నులు మంజూరయిందన్నారు. మండలంలో యూరియా అవసరం ఉన్న రైతులు వారి ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రంలో సంప్రదించిన ఎడల వారికి యూరియా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద తృటిలో తప్పిన పెనుప్రమాదం....



**కడప జిల్లా-సూర్య వాస్తవం :** కడపలో రోజురోజుకు జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు ఒక్కసారిగా కింద పడిన విద్యుత్ స్తంభం ... ఒక ద్విచక్ర వాహనం మీద పడిన కరెంట్ స్తంభం...ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్న వాహనదారులు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగు తున్నాయని వాపోతున్న వాహనదారులు.

## కడప నగరంలోని. వై వి స్ట్రీట్ గణేష్ ఉత్సవాలలో వి ఎస్ అమీర్ బాబు



**కడప జిల్లా-సూర్య వాస్తవం :** అనంతరం ఉత్సవ కమిటీ వారు అందరూ కలసి వివిఎస్.అమీర్‌బాబుని సన్మానించడం జరిగినది. అనంతరం మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్... చెన్నం శెట్టి మురళి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్వామివారి అన్న ప్రసాదాలను, అన్నదాన కార్యక్రమాన్ని ..వి ఎస్ అమీర్‌బాబు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో.. టిడిపి యువ నాయకులు అబ్దుల్లా కడప తెలుగు యువత మాజీ అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీరాములు, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, డాక్టర్ వరకుమార్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాయకునికి నిర్వహించిన ప్రత్యేక పూజలు

### - అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే



**చిత్తూరు- సూర్య వాస్తవం :**
వినాయక చవితి సందర్భంగా చిత్తూరు నగరంలోని డి.ఐ. రోడ్డు మరియు మిట్టూరు ప్రాంతాలకు చెందిన వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యుల, స్థానిక యువత, ప్రజలు, ఉమ్మడి పార్టీల నాయకులు మరియు కార్యకర్తల ఆహ్వానం మేరకు గణనాయకునికి నిర్వహించిన ప్రత్యేక పూజలు మరియు అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి వసంత్ కుమార్ మరియు ఇతర ముఖ్య నాయకులు. పెద్ద ఎత్తున భాణా సంచా పేల్చి, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికిన స్థానిక ప్రజలు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై

# "రాస్తరోకో"ను జయప్రదం చేయండి

### - అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు




**పత్తికొండ టౌన్ - (సూర్య వాస్తవం):**
కార్మిక సంఘాల నాయకులు ఎన్ కృష్ణయ్య ఎం రంగన్న. జి నెట్టే కంటయ్య రైతు సంఘం నాయకులు ఉమాపతి,పెద్ద వీరన్న, ఏం కారన్నలు కే తిమ్మయ్యలు మాట్లాడుతూ... వైజాగ్ స్టీల్‌గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం, భారతదేశంలోని అత్యాధునికమైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీదారు. ఇది, విశాఖపట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించారు. కర్మాగారం ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశవిదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయబడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నాయి.2010 నవంబర్ 10న నవరత్న హెూదా పొందిందనీ కర్మగారం విస్తరించి ఉన్న ప్రాంతం భారతదేశం ఆసియా మైనర్‌లలో అతిపెద్దదనీ .... ఈలాంటి ఉక్కు కర్మాగారంను కేంద్రంలో ముడవసారి అధికారంలోకి వచ్చిన బి జె పి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే కుట్ర వేగంగా సాగుతుందన్నారు.నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర స్టీల్ మంత్రి కుమార్ స్వామి ,సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. దేశంలోని అత్యుత్తమ స్టీల్ ప్లాంట్ అని కొనియాడారు 45 రోజుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని మోడీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించారు నేటికీ ముడుమాసాలైనా దాటినా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. విశాఖ ఉక్కు పరిరక్షణకై అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 10న రాస్తారోకో చేయాలని విజయవాడ ప్రెస్ క్లబ్ లో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ఐక్యవేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న జరిగిన సమావేశంలో చర్చించి రాస్తారోకో కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు.

# గంజాయి విక్రేతల అరెస్ట్ ....



**అనంతపురం క్రైం -(సూర్య వాస్తవం):**
గంజాయిని విక్రయించే ఇద్దరిని అరెస్టు చేసినట్లు అనంతపురం మూడవ పట్టణ సిఐ శాంతి లాల్ తెలిపారు. నిందితుల నుంచి 4400 గంజాయి, రెండూ సెల్‌ఫోన్లు, బంగారం చైను, రెండు ఉంగరాలు ,30,500 నగదు, 1 టాటా జస్ట్ కార్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి . జగదీష్ అదేశాల మేరకు డి.ఎస్.పి టీ. వి.వి ప్రతాప్ పర్యవేక్షణలో మూడో పట్టణ సీఐ శాంతి లాల్ కు అందిన పక్కా సమాచారం మేరకు ఎస్సై జి.గోపాలుడు తన సిబ్బంది సహాయంతో ఆదివారం నాడు సాయంత్రం ఐదున్నర గంటలకు ఇద్దరు ముద్దాయిలను అనంతపురం బళ్లారి బైపాస్ ఎంజి పెట్రోల్ బంక్ వద్ద అరెస్ట్ చేసి వారి దగ్గర ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు బద్దిపూటీ శ్రీధర్, గుండారపు నాగరాజు అనంతపురంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో టెంకాయల మండి వ్యాపారము చేస్తూ జీవనము చేయుచున్నాడని, తాను సంపాదించిన డబ్బులు తన జల్సాలకు చాలనందున సులభముగా డబ్బు సంపాదించాలని, అందుకుగాను గంజాయి వ్యాపారము చేస్తే డబ్బులు ఎక్కువుగా వస్తాయని ఆశపడి తన షాపుకి టెంకాయలను ఆంధ్రప్రదేశ్ లోని అమలాపురం, రాజమండ్రి దగ్గర నుంచి, తమిళనాడు, కేరళ రాష్ట్రల నుంచి లారీలలో లోడ్ తెప్పిస్తూ వుంటాడని, అలా రాజమండ్రి లో ప్రసాద్ అనే కార్ డ్రైవర్ పరిచయం అయి ప్రసాద్ కార్ డ్రైవర్ నుండి గంజాయి వ్యాపారం కూడా చేస్తూ వుంటాడని తెలుసుకొని అతని ద్వారా గంజాయిని కొని టెంకాయల మధ్యలో గంజాయిని పెట్టి టెంకాయల లోడులో అనంతపురమునకు గంజాయిని తెప్పించి తన గ్రామనికే చెందిన వరుసకు అన్న అయిన గుండారపు నాగరాజు తో కలిసి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్స్ లలో పెట్టి అనంతపురములో గంజాయి త్రాగే వారికి ఎక్కువ డబ్బులకు అమ్ముతూ వున్నారని, అదే విధంగా ఆదివారం నాడు కూడా తన కారులో గంజాయిని పెట్టుకొని చిన్న చిన్న ప్యాకెట్స్ లలోకి మార్చడానికి గంజాయిని తీసుకొని పోతూ పెట్రోల్ కోసం అనంతపురము టౌన్ బళ్ళారి బై-పాస్ రోడ్డులో గల ఎం.జీ పెట్రోల్ బంక్ వద్ద ఉండగా వారిని అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




## గర్భవతులు, బాలింతలు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలి

### - ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య

**దువ్వూరు- సూర్య వాస్తవం :**
గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని అలాంటప్పుడే ఆరోగ్యం బాగుంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య పేర్కొన్నారు.సోమవారం మండలంలోని ఐసిడిఎస్ గుడిపాడు సెక్టార్ పరిధిలోని సంగటితిమ్మాయపల్లె అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సౌజన్ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తినే ఆహారం పైనే వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. వారు తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఫైబర్, సూక్ష్మ పోషకాలు అన్నీ ఉండేలా చూసు కోవాలి. ప్రతి సంవత్సరము సెప్టెంబర్ 1 తేదీ నుండి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు జరుపుకుం టాము. మాంస కృతులు సరైన మోతాదులో లేకపోయినా, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా తీసుకున్న అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల సమ తుల్యమైన ఆహారం మంచిదన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని,వారి పెరుగుదలకు ఎంతో దోహదపడతాయన్నారు. స్థానికంగా దొరికే పోషకాహారం తీసుకోవాలని సౌజన్య తెలిపారు. ఐరన్ తో కూడిన ఆహార పదార్థాలను తినాలని సూచించారు. పండ్లు తగిన మోతాదులో తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వర్ణలత ఆయా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ముస్లింపై ఉంది ...

### - కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రతిఒక్కరు ముక్తా కంఠంతో వ్యతిరేకించాలి
### - వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా 50 లక్షల మెయిల్స్ పంపించాలి
### - మాజీ కడప డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా



**కడప -సూర్య వాస్తవం :** ముస్లిం యువత మేలుకుని వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని మాజీ కడప డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా పిలుపునిచ్చారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ కడప నగరంలో మెయిల్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కడప డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా పాల్గొని మెయిల్స్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.... దేశ వ్యాప్తంగా 25కోట్ల ముస్లిం మైనార్టీలు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రతిఒక్కరు ముక్తా కంఠంతో వ్యతిరేకించాలన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాలంటే, ప్రతి ముస్లిం చైతన్యవంతులుగా ముందుకు వచ్చి వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా 50 లక్షల మెయిల్స్ పంపించాలన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరికిపై ఉందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు కోల్పోతే భవిష్యత్తులో మైనార్టీలకు వక్ఫ్ బోర్డు ఆస్తులపైన ఎటువంటి హక్కులు ఉండవాన్నారు. ఇప్పటికైనా ముస్లిం యువత వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకునే విధంగా 50 లక్షల మెయిల్స్ ను పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెయిల్స్ కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు ఉందని, ముస్లిం మత పెద్దలు యువత ముస్లిం మైనార్టీలు ప్రతి ఒక్కరు ఈ మెయిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక"కు 95 వినతులు

**అనంతపురం- సూర్య వాస్తవం:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చిన వినతులను జవాబుదారీగా పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు ప్రజల నుండీ 95 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ఎస్పీ ప్రజల నుండీ పిటీషన్లు స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజలు స్వేచ్ఛగా పిటీషన్లు అందజేశారు. ఎస్పీ పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి ప్రజల నుండీ పిటీషన్లు స్వీకరించారు.

## భక్తిశ్రద్ధలతో వినాయకునికి ప్రత్యేక పూజలు

**- అంగరంగ వైభవంగా వినాయకుడి నిమగ్నం**

**- భక్తాదులకు అన్నదానం నిర్వహించిన కోతిగుట్ట వాసులు**



**రాయదుర్గం -సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణంలోని కోతి గుట్ట ఏరియాలో గత మూడు రోజుల నుండి వినాయక ఉత్సవాలను వార్డు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు కావడంతో వేల సంఖ్యలో వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమం. కోతి గుట్ట వాసులు అమృత వాటర్ ప్లాంట్ రఘునాథ్ రెడ్డి, గ్రా ఉమెన్ రైట్స్ జిల్లా సెక్రెటరీ బజంత్రీ లోకనాథ డ్రైవర్ రామాంజనేయులు, బి సుధా మోహన్ సద్గురు బ్రిక్స్ నాగభూషణం, గంగాధర్ శెట్టి, కసందుల శ్రావణ్ కుమార్, నవీన్ కుమార్ కసందుల సత్తి తిప్పేస్వామి రాయుడు భక్తాదులు, ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నిమగ్నం రోజు వాసి రఘునాథ్ రెడ్డి, స్వామి వారి లడ్డును 9000 రూపాయలకు వేలంలో కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఊరేగింపుగా గంగాదేవి చెంతకు చేర్చడానికి కోతుగుట్టు వాసులు వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి చాలామంది భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు,,, పదోన్నతులు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం- సూర్య వాస్తవం:** ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కారుణ్య నియామకాలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, కలెక్టరేట్లో ఆధునీకరణ పనులపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల బదిలీలు, కారుణ్య నియామకాలు, ఆఫీస్ సబార్డినేట్ నుంచి జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్ఏ నుంచి వీఆర్వోలకు పదోన్నతులు, వీఆర్వో నుంచి సీనియర్ అసిస్టెంట్లకు, సీనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ తహసిల్దార్లకు పదోన్నతుల ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుని ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అనంతపురం కలెక్టరేట్లో ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం కింద, పైన మరుగుదొడ్లు బాగు చేయాలని, లిఫ్ట్ ఏర్పాటు పనులు వేగంగా చేయాలని, ఎల్ఈడి డిస్ ప్లే బోర్డు కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్లో అనంత మమతా నిలయం ఏర్పాటు, రెండు రూములు బాగు చేయడం పట్ల డిఆర్ఓని, ఏపిఈడబ్ల్యూఐడిసి ఈఈని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏపిఈ డబ్ల్యూఐడిసి ఈఈ రమణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ జి.మారుతి, కలెక్టరేట్ సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

# సమస్యలను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్**

**డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**



**అనంతపురం- సూర్య వాస్తవం:** అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎస్డిసిలు శిరీష, కరుణకుమారి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 315 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎలాంటి పెండింగ్ లేకుండా గడువులోగా సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదని, అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆహారం వైవిధ్యం – ప్రాముఖ్యతపై తయారుచేసిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించడం జరిగింది. మంచి ఆరోగ్యం కొరకు, మనం రోజు అన్నిరకాల ఆహార పదార్థాలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా అందుబాటులో చౌకగా దొరికే పోషక విలువలున్న ఆహార పదార్థాలు ఉపయోగించాలన్నారు. తదనంతరం ద ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అండ్ ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయానికి ఐయస్ఓ 9001:2015 సర్టిఫికేట్ గుర్తింపు లభించడంతో హైదరాబాద్ కు చెందిన గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అందించిన సర్టిఫికెట్ ను డిటిడబ్ల్యూఓ రామాంజనేయులుకు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్.అండ్.బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ పాల్ డా.రవికుమార్, సిపిఓ అశోక్ కుమార్, ఎల్డిఎం నర్సింగరావు, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజారావు, డిటిసి వీర్రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, సర్వే ఏడి రూప్ల నాయక్, కలెక్టరేట్ ఏవో జి.మారుతీ, డీఆర్డీఏ పిడి మరియు జడ్పి సిఈఓ ఓబులమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, డీఎస్ఓ శోభారాణి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, మార్కెటింగ్ ఏడీ చౌదరి, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, డిసిఓ అరుణకుమారి, కలెక్టరేట్ ఏవో మారుతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు రియాజుద్దీన్, వసంతలత, డిపిఎం ఆనంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం చేపట్టండి

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**- పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ**



**అనంతపురం- సూర్య వాస్తవం:** అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. గణేష్ ప్రతిమలను కాలువ నీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించడంతో పాటు స్వయంగా ఆయన నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎస్పీ, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా... నిమజ్జనం ప్రాంతాలలో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రక్రియ కు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడం తో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ వెంట అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, తదితరులు వెళ్లారు.

# వినాయకుడి నిమజ్జనానికి పోలీసులు సర్వం సిద్ధం

**- అనంతపురం నగరంలో గణేష్ నిమజ్జనానికి పోలీసుల పటిష్ట చర్యలు**

**- ప్రశాంత నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు**

**- అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిమజ్జనం పూర్తి అయ్యేందుకు అందరూ సహకరించాలి**



**అనంతపురం- సూర్య వాస్తవం:** బుధవారంనాడు అనంతపురము నగరంలో జరుగబోవు వినాయక నిమజ్జనోత్సవం గురించి గణేష్ విగ్రహ మండపాల నిర్వహకులకు, నగర ప్రజలకు పోలీసు వారి సూచన మేరకు గణేష్ విగ్రహాలు ఊరేగింపుగా తీసుకెళ్లడానికి రూట్ మ్యాప్‌ను పోలీసులు సిద్ధం చేశారు. సప్తగిరి సర్కిల్, రాజీవ్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్ రోడ్డు, తాడిపత్రి బస్ స్టాండ్, గాంధీబజార్, బసవన్న కట్ట ,సూర్యనగర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, పిటిసి, నడిమివంక – కళ్యాణదుర్గం బైపాస్ 10 అడుగుల కంటే ఎత్తైన విగ్రహాలు పంపనూరు కెనాల్ వద్ద నిమజ్జనం చేయాలనీ సూచించారు. బళ్ళారి బైపాస్ 10 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు రాచానపల్లి వంక వాడ నిమజ్జనం చేయాలనీబుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గణేష్ విగ్రహాలు ఊరేగింపును ప్రారంభించాలనీ
10 అడుగుల కంటే తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను అనంతపురము రూరల్ మండలంలోని రాచానపల్లిలో నిమజ్జనం చేయాలన్నారు. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను పంపనూరు కెనాల్ లో నిమజ్జనం చేయాలనీ నిర్వాహకులు విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయవలెనో పోలీసు వారు ముందే తెలియజేస్తారన్నారు. నిర్దేశించిన ప్రదేశములోనే వారి విగ్రహాలను నిమజ్జనం చేయాలనీ కోరారు. ఎత్తైన విగ్రహాలను నిమజ్జనానికి తీసుకుని వెళ్లడానికి రుద్రంపేట బైపాస్, బళ్ళారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్ వద్ద ఉన్న నేషనల్ హైవే బ్రిడ్జ్ ఆటంకము కలుగును. అటువంటి ఎత్తైన విగ్రహాలను, నిర్వాహకులు తపోవనం సర్కిల్ మీదుగా సర్వీసు రోడ్డులో విగ్రహాలను తీసుకునివెళ్ళి కళ్యాణదుర్గం రోడ్డుకు తీసుకుని వెళ్లాలన్నారు.

గణేష్ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా, ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలు గకుండా పోలీసు వారికి సహకరించి ఉత్సవాలను ఘనంగా, ఆహ్లాదకరంగా నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ మరియు విగ్రహ మంటపాల నిర్వాహకులకు పోలీసుల విజ్ఞప్తి చేశారు.

**ట్రాఫిక్ మళ్లింపు:**

కార్లు, లారీలు, ఆర్‌టిసి బస్సులు, ప్రయివేటు బస్సులు, ఇతర భారీ వాహనాలు కింద తెలిపిన ప్రదేశాల గుండా వెళ్ళుట నిషేధమని తపోవనం సర్కిల్, రవి పెట్రోల్ బంక్,రాజహంస అపార్ట్మెంట్ (సాక్షి ఆఫీసు)

–పంగల్ రోడ్డు
–కలెక్టరేట్
–భాస్కర్ పెట్రోల్ బంక్
–మేడా పెట్రోల్ బంక్
–మిర్చి యార్డు
–తడకలేరు

**పోలీస్ బందోబస్త్ నిర్వహణ**

అనంతపురము నగరములో జరుగబోవు వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా నగరములో, నిమజ్జన ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిమిత్తం సుమారు 500 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారనీ తెలియజేశారు.

## వాల్మీకి ముదిరాజ్ సంఘానికి స్థలం కేటాయించాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలో వాల్మీకి ముదిరాజ్ సంఘానికి భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని సోమవారం తాసిల్దార్ లక్ష్మీప్రసన్నకు లక్కిరెడ్డిపల్లి మండల వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దుల రామచంద్రయ్య, బిజెపి కృష్ణ,మూగి వెంకటరమణలు మాట్లాడుతూ మండల లక్కిరెడ్డిపల్లి మండలంలో ముదిరాజులు, వాల్మీకులు అధిక సంఖ్యలో ఉన్నారని వాల్మీకి మహర్షి జయంతి, పూలే జయంతి, అంబేద్కర్ జయంతిలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించు కోవడానికి, అనువైన స్థలం లేక చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని మండల కేంద్రమైన లకిరెడ్డిపల్లిలో స్థలం కేటాయించాలని తాసిల్దారుని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణయ్య ఆర్.ఎన్.పి అదిశేఖర్, విశ్రాంతి ఉపాధ్యాయుడు ఆదినారాయణ, నాగరాజు, రామాంజనేయులు, నాగభూషణం, యోగాం జనేయులు, బాలు, మల్లయ్య, మహేష్,శ్రీనివాసులు, రాజా, తదితరులు పాల్గోన్నారు.

## బొజ్జ గణపయ్య మా మొర ఆలకించవయ్య


### - పంతగాని నరసింహ ప్రసాద్



**రైల్వే కోడూరు -సూర్య వాస్తవం:** బొజ్జ గణపయ్య మా మోర ఆలకించయ్య అంటూ గణపయ్య నిమజ్జన వేడుకలలో రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ వేడుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం రైల్వేకోడూరు పట్టణంలోని లక్ష్మీ నగర్, బజారు వీధి, కొత్తకోడూరు, నరసరావుపేట, డాల్ఫిన్ వీధి, తదితర గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గణనాధుని నిమజ్జన వేడుకలలో ఘనంగా పూజలను ఘనంగా పంతగాని నరసింహ ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన సందర్భంలో తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరదల నుండి ప్రజలను సురక్షితంగా కాపాడడంలో ఆయనను ఈ ప్రభుత్వాన్ని చల్లంగా చూడయ్యా అని గణపతి దేవుడిని వేడుకున్నట్లు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా గణపతి పూజలలో ఆనవాయితీగా పాల్గొంటున్నారని కోడూరు ప్రజలు చూపిస్తున్న అభిమానం మరువ రానిదని పంతగాని నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్ నాయుడు, కస్తూరి దినేష్ నాయుడు, రామకృష్ణ, మందపాటి శంకరయ్య, ఆచారి, చిగురుపాటి శంకర, మిట్ట వీధి మధు, ఆర్యవైశ్య నాయకులు మావిళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంత గాని నరసింహ ప్రసాద్ ను పురవీధుల్లో ఘనంగా సన్మానించి, అభిమానులు పూలమాలలతో ముంచెత్తారు.

## సిద్దవటం పెన్నానదిలో ఘనంగా వినాయక నిమజ్జనం





**సిద్దవటం - సూర్యవాస్తవం:** మండలకేంద్రమైన సిద్దవటం పెన్నానదిలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దవటం, అట్లూరు, బద్వేలు, ఒంటిమిట్ట మండలంలోని కొన్ని గ్రామాల నుంచి, కడప తదితర ప్రాంతాల నుంచి మూడవ రోజు నిమజ్జనానికి వచ్చిన గణపతి ప్రతిమలను నిర్వాహకులు పెన్నానది హైలెవల్ వంతెన నుంచి క్రేన్ సహాయంతో పోలీసుల బందోబస్తు నడుమ నిమజ్జనం చేశారు. ఒంటిమిట్ట సీఐ క్రిష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ మురాషావలి, ఎంపిడిఓ జవహర్ బాబు, సిద్దవటం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, వీఆర్వో చెన్నకేశవులు వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## జనవిజ్ఞాన వేదిక

# నూతన జిల్లా అధ్యక్షుడిగా సమీర్ బాష ఎన్నిక



**సిద్దవటం- సూర్యవాస్తవం:** ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశంలో 11వ బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమీర్ బాష ను జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వైవియూ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, ఎస్. వి. ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వీర సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఓబుల్ రెడ్డి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, తవ్వా సురేష్, దేవదత్తం, వెంకటసుబ్బయ్య, సునీత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, నగర ప్రధాన కార్యదర్శి శివరాం తదితరులు పాల్గొన్నారు.సమీర్ బాష 2008లో జన విజ్ఞాన వేదికలో వేంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా అరంగేట్రం చేశారు. వేంపల్లిలోని శ్రీ రామ్‌నగర్‌లో (గుట్టమీద) ఉన్న ప్రాథమిక పాఠశాలలో దయ్యాలు, భూతాలు ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపించక నెల రోజులుగా స్కూలు మూతపడితే, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో అక్కడ స్థానికంగా ఉన్న నాయకులతో, మీడియాతో సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించి వాళ్ళలోని అపోహలను తొలగించి స్కూలును మరలా తెరిపించి తల్లిదండ్రులు, పిల్లల్ని స్కూలుకు పంపించే క్రమంలో కీలక పాత్ర పోషించారు. ఒంటిమిట్టకు బదిలీపై వచ్చిన తర్వాత అక్కడ మండల అధ్యక్షుడుగా ఉండి పలు రకాల కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు, ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునే విధంగా వాళ్లలో చైతన్యం తె చ్చారు. జన విజ్ఞాన వేదిక లో మెజీషియన్ గా, గాయకుడిగా కూడా ఉంటూ తన వంతు కృషి చేస్తూ ఎన్నో కార్యక్రమాల్లో మ్యాజిక్ ద్వారా పాటల ద్వారా ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించడానికి విశేష కృషి చేస్తున్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదికలో జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా పనిచేసి సంఘము అభివృద్ధికి సేవలు అందించారు. ఆయన జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పలు సంఘాలు, ఉపాధ్యాయులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## భూమిరెడ్డి రవికళ్యాణ్‌కు

# ఉత్తమ ఉపాధ్యాయ పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు

**- వేల మంది ఉపాధ్యాయుల మధ్య అతిథులు, నాయకుల మధ్య**
**- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న భూమిరెడ్డి రవి కళ్యాణ్**





**మైదుకూరు- సూర్య వాస్తవం:** భూమిరెడ్డి రవికళ్యాణ్ కు పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు కు ఎన్నిక సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైవేట్ పాఠశాలల కళాశాలల టీచర్లకు అందజేసే 2024 ఉత్తమ ఉపాధ్యాయ పాన్ ఇండియా ఐకానిక్ అవార్డుకు మైదుకూరు నగరంలోని బాల శివ యోగేంద్ర మహారాజు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, జర్నలిస్ట్, తెలుగు ఉపాధ్యాయుడు గిడుగు జాతీయ కళాసాహిత్య పురస్కార్ అవార్డు గ్రహీత నంది గోల్డెన్ అచీవ్మెంట్ అవార్డు గ్రహీత భూమిరెడ్డి రవి కళ్యాణ్ ప్రవేట్ టీచర్ల పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు కు ఎన్నిక కావడం జరిగింది. ఆదివారం గుంటూరులో జరిగిన ఇండియా లెవెల్ లో జరిగే పాన్ ఇండియా అవార్డు కు 7000 వేల మంది ఉపాధ్యాయులు అవార్డుకు అప్లై చేయగా అందులో భారతదేశంలో ఎన్నికైన 1200 మంది ఉపాధ్యాయులు మాత్రమే పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు ఎందుకు రావడం జరిగిందని అందులో ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా మైదుకూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన భూమిరెడ్డి మనోహర్, భూమిరెడ్డి మార్తమ్మ దంపతుల కుమారుడు తెలుగు ఉపాధ్యాయుడు మైదుకూరు వాసి శ్రీబాల శివ యోగేంద్ర మహారాజు డిగ్రీ కళాశాల, సాహిత్య డిగ్రీ కళాశాల గిడుగు జాతీయ కళా సాహిత్య పురస్కార్ అవార్డు, నంది గోల్డెన్ అచీవ్మెంట్ అవార్డు గ్రహీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భూమిరెడ్డిరవికళ్యాణ్ కు ప్రైవేటు ఉపాధ్యాయ పాన్ ఇండియా ఐకాన్ అవార్డు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024 సెప్టెంబర్ 8వ తేదీన గుంటూరులోని కెన్నెడీ నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ అమరావతి నగరాలు గోరంట్ల స్కూల్లో ముఖ్య అతిథులు అధికారులు ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు చేతుల మీదుగా భూమిరెడ్డి రవి కళ్యాణ్ పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు మెడల్ తో సత్కరించి సర్టిఫికెట్ మెమెంటుతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయునిగా భూమిరెడ్డి రవి కళ్యాణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024 పాన్ ఇండియా అవార్డు దక్కడం గర్వకారణం అని సమాజంలో విద్య ద్వారా సమాజ సేవ ద్వారా దేశభక్తిని పెంపొందిస్తూ విద్యార్థులను దేశభక్తిగా సోల్జర్ గా తయారు చేయడం వంటి సదా భరతమాత సేవలో సేవలందిస్తానని తెలిపారు. నాపై ఉన్న అభిమానులు పంచుతున్న శ్రేయోభిలాషులు మిత్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు ఫోన్లో ద్వారా వాట్సాప్ ఫేస్బుక్ ద్వారా హర్షం వ్యక్తం చేస్తున్న అభిమానాన్ని చాటినందుకు అందరికీ హృదయపూర్వక నమస్కారములు తెలపడం జరిగింది.



## ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశానికి మరిన్ని పథకాలు తెస్తా....

### - అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ కొర్లగుంట నాగరాజు



**వీరబల్లి-సూర్య వాస్తవం:** నేపాల్ లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల విభాగంలో 390 కిలోల బరువును ఎత్తి అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ ను సాధించిన కొర్లకుంట నాగరాజు ను సోమవారం అన్నమయ్య జిల్లా వీరబల్లిలోని ఎస్డికెఆర్ డిగ్రీ కళాశాలలో వీఆర్డిఎస్ ఆధ్వర్యంలో వీరబల్లి ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, విఆర్డిఎస్ సురేంద్ర రెడ్డిలు ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామీణ ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ లో విజయం సాధించి గోల్డ్ మెడల్స్ ను సాధించడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలని పట్టుదల, ఆత్మ స్థైర్యమే ఈ స్థాయికి తీసుకెళ్లాయని అన్నారు.విఆర్డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ నాగరాజు మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు.సన్మాన గ్రహీత నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు తీసుకొచ్చి భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. అనంతరం నాగరాజును మిత్రులు ,నాయకులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సిరిగిరి కుళాయి రెడ్డి,రవి,పక్కిరయ్య, ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు భాస్కర్, అన్నమయ్య జిల్లా అసోసియేట్ సైన్స్ ఆఫీసర్ పల్లం రామచంద్ర ఎస్డీకేఆర్ కళాశాల సిబ్బంది గీత, అంజలి, నాగయ్య, శ్రీనివాసులు, కళాశాల ఎన్ యెస్ యెస్ విద్యార్థులు పాల్గొన్నారు.



## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

### - ఇంచార్జి కడప ఆర్డీవో వెంకటపతి

**కడప -సూర్య వాస్తవం :** కడప జిల్లా లోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇంచార్జి కడప ఆర్డీవో వెంకటపతి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ హాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇం చార్జి కడప ఆర్డీవో వెంకటపతితో పాటు డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, జడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి..లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కడప ఆర్డీవో వెంకటపతి మాట్లాడుతూ....ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. పెద్దముడియం మండలం, కొండ పాపాయిపల్లి కి చెందిన కె. సుబ్బారెడ్డి తన వారసత్వ పు ఆస్తిని భూ కబ్జాల నుండి కాపాడి తన భూమి తనకు ఇప్పించాలని అర్జీని సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాణిపాకం ఆలయ పవిత్రతను కాపాడండి

## - మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి సూచన

**ఐరాల– సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కాణిపాకంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో కాణిపాకం శ్రీవర సిద్ధి వినాయక స్వామి దేవాలయము ఒకటిగా పేరొందిన విషయం మన అందరికి తెలిసిందే అని మాజీ మంత్రివర్యులు గల్లా అరుణకుమారి సోమవారం పత్రిక ముఖంగా తెలియజేశారు. రాష్ట్ర, దేశ, విదేశాలనుండి వేలాది మంది భక్తులు ప్రతి రోజు స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులను తీర్చు కుంటున్నారు. అలాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, భక్తి బావాలు పెంపొందించేలా ఆలయ పరిసరాలను సుమారు 500 ల మీటర్ల విస్తీర్ణంలో తీర్చి దిద్దవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఈ ఆలయం నుండి అగరంపల్లి వద్ద గల ఆర్చి వరకు ఐరాల క్రాస్ వద్ద కొత్తగా నిర్మించిన ఆర్చి వద్ద వివిధ రాజకీయ నాయకుల బ్యానెర్లతో వ్యాపార ప్రకటనలతో నిండి




ఉన్నది. దీనివలన భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నేను మా కుటుంబ సభ్యులతో కలిసి ఆ దారిలో వెలుతూ ఈ వింత పోకడలను చూసినప్పుడల్లా మనసుకు కష్టంకలుగుతున్నది. నేను చెంద్రగిరి ఎమ్మెల్యే గా, మంత్రి గా ఉన్నప్పుడు ఈ ఆలయ పరిసరాలనుండి ఆర్చి ముందు వరకు ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు గాని, రాజకీయ వ్యాపార బ్యానెర్లను ఉంచ రాదని తీర్మానం చేయించి అమలు చేయడం జరిగినది. ముఖ్యమంత్రులు వచ్చినప్పుడు కూడ ఈ నియమాన్ని పాటించడం జరిగింది. ఇందుకు ఆలయ ఉభయదారులు, వివిధ రాజకీయ పక్షాలు అన్ని వర్గాల ప్రజలు తమపూర్తి సహకారాన్ని అందించడం జరిగింది. తద్వారా భక్తులు భక్తి భావంతో గుడికి వచ్చి స్వామిని దర్శించుకొని ఆనందంగా తిరిగి వెళ్లే వారు. గత కొన్ని సవత్సరములుగా తిరిగి ఆలయ పరిసర ప్రాంతాల పవిత్రత దెబ్బతినే విధంగా వివిధ రాజకీయ వ్యాపార బ్యానర్లతో నిండి ఉన్నది. ఇంత జరుగుతున్న ఆలయ అధికారులుగాని స్థానిక పోలీసులు గాని ప్రభుత్వ అధికారులుగాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. రాష్ట్ర, దేశ, విదేశాలనుండి వచ్చే భక్తుల మనోభావాలనుకాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉన్నది. ఇందుకు గాను ఆలయ పరిసర ప్రాంతాలు భక్తి భావాలతో ఉట్టి పడేలా తీర్చిదిద్ద వలసిన అవసరం ఎంతైనా ఉన్నది.కావున కలెక్టరు సుమిత్ కుమార్ స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ సంబంధిత ఆలయ అధికారులకు తగు సూచనలు చేసి ఆలయ పరిసర ప్రాంతాలలో ఎటువంటి రాజకీయ కార్యకలాపాలకు బ్యానర్లకు చోటు ఇవ్వకుండా భక్తి పారవశ్యం పెంపొందించే విధంగా వెంటనే తగు చర్యలు తీసుకొనగలరని మాజీ మంత్రివర్యులు గల్లా అరుణ కుమారి తెలిపారు.

# 2023 సెప్టెంబర్ 09 బ్లాక్ డే

**- నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసిన రోజు**

**- ఈ రోజు 2024 సెప్టెంబర్ 09 బ్లాక్‌డేగా ప్రకటించిన జిల్లా టీడీపీ**

**చిత్తూరు– సూర్యా వాస్తవం :** చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ సి.ఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ తదితరులు మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్ తొమ్మిదవ తారీకున ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజా పర్యటనలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు ని ప్రాథమిక సాక్షాదారాలు ఏమీ లేకున్నా, జగన్మోహన్ రెడ్డి, పైశాచిక, వికృత రాజకీయాలతో, అధికార దుర్వినియోగంతో, స్కిల్ డెవలప్మెంట్ కేసు లో అవకతవకలు జరిగాయని తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం జరిగినది. 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలించిన ఒక మేధావి ని, ముందు చూపు ఉన్న నిస్వార్థ నాయకుడిని తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టడంతో ప్రజా స్వామ్య వాదుల, ప్రజల హృదయాలు బరువెక్కి ఆ మహా నాయకుడు కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలతో పాటు అటు భారతదేశం పూర్తిగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు కార్యకర్తలు నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్లమీద నిరసన కార్యక్రమాలు చేపట్టి చంద్రబాబు అరెస్ట్ ప్రజా స్వామికమని గొంతెత్తి సభ్య సమాజానికి




తెలియజేశారు.ఒక ఫ్యాక్షనిస్టు ముఖ్యమంత్రి, అసమర్ధత ముఖ్యమంత్రి, వికృత చేష్టల ముఖ్యమంత్రి పరిపాలన వలన రాష్ట్ర ప్రతిష్ట మంట కలిసిందని, రాజ్యాంగానికి చీకటి రోజు అని రాజకీయాలు అంటే నే ప్రజల అసహ్యించుకునే విధంగా జగన్మోహన్ రెడ్డి పరిపాలించాడని దీని పర్యవసానం 2024 ఎన్నికలలో ఇలాంటి వికృత చేష్టలు చేసే జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని ప్రజలను నిర్ణయించుకొని ఆ వైసిపి పార్టీకి 11 ఎమ్మెలే లుకు పరిమితం చేసి, జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా ఉండకూడదని చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు.ఒక నిర్దోషిని 53 రోజులు జైల్లో పెట్టి వికృతానందం పొందిన, నీచ చరిత్ర జగన్మోహన్ రెడ్డి దని చరిత్ర పుటల్లోకి ఎక్కాడు ఏదేమైనా ప్రజల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాలకేయులు లాంటి జగన్మోహన్ రెడ్డి క్రూర పరిపాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించి సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నాయుడు పోరాట పటిమకు అభినందనలు తెలియజేస్తున్నాము.ఈ యొక్క పత్రిక సమావేశంలో పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్నాథ్ నాయుడు, వెంకటేష్ రబ్బి, సునీల్ కుమార్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెంటల్ హెల్త్ మ్యాటర్స్ అట్ వర్క్ అనే అంశంపైన చర్చ బ్రోచర్ను విడుదల

## - అపోలో వైస్ ఛాన్సలర్



**చిత్తూరు –సూర్య వాస్తవం :** అక్టోబర్ 9,10 రెండు రోజుల పాటు చిత్తూరు నగరంలోని ముర్కం బట్టు అపోలో యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో భాగంగా మెంటల్ హెల్త్ మ్యాటర్స్ అట్ వర్క్ అనే అంశం పైన చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సర్ డాక్టర్ వినోద్ భట్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అపోలో యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి అక్టోబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రీ కాన్ఫరెన్స్ ఈవెంట్స్ లో భాగంగా అవగాహన ర్యాలీతో పాటు, మూడు రోజులు సైకాలజీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 9 10 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్కు ముఖ్య వక్తలుగా కెనడా నుంచి మధు భరద్వాజ్, ఆఫ్రికా నుంచి డాక్టర్ సంద్రా జుంబే, నేపాల్ నుండి డాక్టర్ నరేంద్ర సింగ్ తగుణ, మరి కొంతమంది వక్తలు పాల్గొంటారని వెల్లడించారు. పదవ తేదీ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని స్కాలర్లు, విద్యార్థులు, ప్రముఖ వైద్యులు, వక్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం పోతరాజు, డీన్ డాక్టర్ కే భాస్కర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ హసీనా, జాయింట్ సెక్రటరీ డాక్టర్ పి సుధ, కోఆర్డినేటర్లు డాక్టర్ కబిలాన్ అన్నాదురై, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర

## - అర్బన్ ఎస్ఐ జిటి నాయుడు



**కుప్పం – సూర్య వాస్తవం :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేరాలను కట్టడి చేయవచ్చని అర్బన్ సీఐ జీటీ నాయుడు అన్నారు. సోమవారం నాడు కుప్పం పట్టణంలో మర్చంట్ అసోసియేషన్ మరియు ఆర్ఎస్ పెట్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పట్టణంలోని దుకాణదారులు, ప్రజలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, టిడిపి నేతలు ఆర్ఆర్ రవి మంజునాథ్ ఉమాపతి జాలు తదితరులు పాల్గొన్నారు.



# కాణిపాకం దేవాలయానికి రెండు టన్నుల కూరగాయల అందజేత

**శాంతిపురం–సూర్యవాస్తవం :** కాణిపాకం వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల సందర్భంగా సుమారు రెండు టన్నుల కూరగాయలను శాంతిపురం మండలం జిల్లా పరిషత్ సభ్యులు శ్రీనివాసులు వారి మిత్ర బృందం కాణిపాకం ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంభువు వరసిద్ధి వినాయకుడి దేవస్థానానికి కూరగాయలను అందించడం దైవకార్యంగా భావించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన తన మిత్ర బృందం కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, మిత్రులు పగడాల సురేష్, బాబు రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

# పక్కాగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే...

## -ఆర్డీవో చిన్నయ్య






**చిత్తూరు– సూర్యా వాస్తవం :** స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025లో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025 లో భాగంగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కార్యక్రమాల నిర్వహణపై చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్వోలు) ప్రత్యేక సమీక్ష సమావేశం సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీల్లోగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా బిఎల్వో యాప్ లో వివరాల నమోదు కోసం ఇంటింటి సర్వే క్షేత్రస్థాయిలో పక్కాగా చేయాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలోని వివరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి యాప్ లో నమోదు చేయాలన్నారు. జాబితాలో నాణ్యమైన ఫోటోలే ఉండేలా చూడాలని, ఓటర్ల స్థానంలో ఇతర ఫోటోలు ఉంటే సత్వరం గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సహాయ కమిషన ఎ.ప్రసాద్ మాట్లాడుతూ.. బీఎల్వోలు ఇంటింటి సర్వేను ఈనెల 21వ తేదీ లోపల పూర్తి చేయాలని, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళావతి, ఈ–డీటీ హిమగిరి, ఏఎస్వో సౌందర్ రాజన్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

# పారిశుధ్యం కార్మికులను వారి వారి మున్సిపాలిటీలకు తరలించాలి

## - ఇతర మున్సిపాలిటీ నుండి కార్మికులను పిలిపించి పారిశుద్ధ్య పనులను నిర్వహించాలి

## - అధికారులకు ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ .నాగరాజు విజ్ఞప్తి

**చిత్తూరు– సూర్యా వాస్తవం :** ఇటీవల విజయవాడలో మహానగరంలో కురుస్తున్న వర్షాలకు వరదలకు అతలాకుతరమైన విజయవాడ మహా నగరంలో పారిశుధ్యం పనులను నిర్వహించడానికి ఇతర జిల్లాల మున్సిపల్ నుండి పారిశుధ్య కార్మికులను రెండు రోజులు మూడు రోజులు ఉండాలి అని తరలించడం జరిగింది. కానీ



కంటిన్యూగా వారం రోజుల పాటు కార్మికులను పనులు పేట్టడం వల్ల ప్రస్తుత వాతావరణం అనుకూలించక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులు పాటు అక్కడే ఉండడం వల్ల వారికి మార్చుకోవడానికి కూడా బట్టలు లేకుండా ఇబ్బందులకు గురి అవుతున్నారు. వారం రోజులు రాకపోవడంతో వారి కుటుంబంలో కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులు పారిశుధ్యం పనుల్లో ఉన్నందున వారికి సకాలంలో టిఫిన్లు, భోజనాలు అందించడం లేదని వాపోయారు. సంబంధిత అధికారులు ఆలోచించి మానవతా దృక్పథంతో ఆలోచించి వారి బాధలను అర్థం చేసుకొని ఇతర జిల్లాలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులను బ్యాచులు, బ్యాచులుగా పిలిపించి పారిశుధ్యం పనులను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. గత వారం రోజులుగా పనిచేస్తున్న కార్మికులను వారి వారి మున్సిపాలిటీలకు స్వగ్రామానికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కన్నప్ప టీం స్పెషల్ పోస్టర్

హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్‌కుమార్‌సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. బాలీవుడ్ హీరో మంచు మోహన్‌బాబు అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్ హీరో అక్షరుకుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఆయన పుట్టినరోజు కావటంతో చిత్రబృందం శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.





## లైంగిక దాడిచేస్తే తీవ్రమైన చర్యలు : విశాల్

తమిళ సినీ పరిశ్రమలో మహిళలపై లైంగిక దాడులకు ఒడికట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ హెచ్చరించారు. దక్షిణ భారత నీటీనటుల సంఘం (నడిగర్ సంఘం) 68వ వార్షిక సర్వ సభ్య సమావేశం చైన్నెలో జరిగింది. ఈ సమావేశంలో విశాల్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం విశాఖ కమిషన్‌ను ఏర్పాటుచేశారన్నారు. లైంగిక వేధింపులకు ఎవరైనా గురైనట్లుగా ఫిర్యాదులొస్తే తప్పు చేసిన వారిపై తీవ్రమైన చర్యలుంటాయన్నారు. ఈ మేరకు ఒక తీర్మానం కూడా చేశామన్నారు. బాధితులు నేరుగా తమకే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటికైతే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. నటీమణులకు నడిగర్ సంఘం అండగా ఉంటుందన్నారు. సంఘం అధ్యక్షులు నాజర్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ సీనియర్ ఆర్టిస్టులను అభినందిస్తూ సత్కరిస్తున్నామన్నారు. జనరల్ బాడీలో తీసుకున్న నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. నడిగర్ సంఘం పొడిగింపును సభ్యులంతా అంగీకరించారన్నారు. ఈ సమావేశంలో నడిగర్ సంఘం కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచీ మురుగన్, కరుణాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## త్వరలో 'గేమ్‌ఛేంజర్'
# రెండోపాట విడుదల

రామ్‌చరణ్ హీరోగా, హీరోయిన్‌గా కియారా అద్వానీ నటించిన చిత్రం 'గేమ్‌ఛేంజర్'. దర్శకుడు శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'జరగండి జరగండి' అంటూ మొదటి పాటను గతంలోనే విడుదల చేసిన విషయం తెలిసిందే. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్లపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈనెలలోనే మరోపాటను రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం తెలియజేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఓ ఉత్సవం నేపథ్యంలో రామ్‌చరణ్ ఉక్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. సంగీతం తమన్, కెమెరా ఎస్.తిరుణావుక్కరసు అందిస్తున్నారు.






# చాంపియన్ సబలెంకా

❖ మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం
❖ ఫైనల్లో జెస్సికా పెగులాపై గెలుపు ❖ యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

**బెలారస్ భామ, రెండో సీడ్ అర్యాన సబలెంకా ఎట్టకేలకు సాధించింది. యు.ఎస్ ఓపెన్‌లో గత మూడేండ్లుగా నిరాశ చవిచూసిన సబలెంకా.. 2024 సీజన్‌లో అదరగొట్టింది. నిరుడు ఫైనల్లో రన్నరప్‌గా నిలిచిన సబలెంకా.. అంతకుముందు వరుస సీజన్లలో సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. అమెరికా అమ్మాయి, తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ జెస్సికా పెగులాపై ఉత్కంఠ విజయం సాధించిన సబలెంకా మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది.**



**న్యూయార్క్-సూర్య వాస్తవం**
మహిళల సింగిల్స్ టైటిల్‌ను రెండో సీడ్ బెలారస్ స్టార్ అర్యాన సబలెంకా సొంతం చేసుకుంది. సుమారు రెండు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత టైటిల్ పోరులో సబలెంకా కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆరో సీడ్ అమెరికా అమ్మాయి జెస్సికా పెగులాపై 7-5, 7-5తో వరుస సెట్లలో విజయం సాధించింది. తొలిసారి యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటం దక్కించుకుంది. సబలెంకా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ విజయం కాగా.. ఈ సీజన్‌లోనే రెండోది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన సబలెంకా టెన్నిస్ ఓపెన్ చరిత్రలో ఓ సీజన్‌లో రెండు హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఆస్ట్రేలియన్, యు.ఎస్ ఓపెన్) సాధించిన ఐదో క్రీడాకారిణిగా నిలిచింది. ఆద్యంతం ఉత్కంఠ: మహిళల సింగిల్స్ ఫైనల్ అంచనాలకు భిన్నంగా సాగింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో పోటీపడిన జెస్సికా పెగులా కండ్లుచెదిరే పోరాట పటిమ చూపించింది. ఆఖరు పాయింట్ వరకు గట్టి పోటీ ఇచ్చింది. రెండు గంటల టైటిల్ పోరులో సబలెంకా ఎక్కడా సులువుగా పాయింట్లు సాధించలేదు. ప్రతి పాయింట్ కోసం చెమటోడ్చక తప్పలేదు. నెట్ గేమ్ వద్ద పెగులాపై పైచేయి సాధించిన సబలెంకా.. ఫైనల్లో విజయం సాధించింది. నెట్ వద్ద సబలెంకా 18 పాయింట్లు సాధించగా.. పెగులా కేవలం ఐదు పాయింట్లు సాధించింది. సబలెంకా రెండు సెట్లలో ఏకంగా ఆరు సార్లు పెగులా సర్వ్‌ను బ్రేక్ చేసింది. పెగులా సైతం నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించినా.. సబలెంకాపై పైచేయి సాధించటంలో విఫలమైంది. సబలెంకా ఆరు ఏస్‌లు కొట్టగా.. జెస్సికా నాలుగు ఏస్‌లు సంధించింది. విన్నర్ల పరంగా సబలెంకా 40 విన్నర్లు గెలుపొందగా.. జెస్సికా 17 విన్నర్లను మాత్రమే గెల్చుకుంది. పాయింట్ల పరంగా 88-79తో సబలెంకా పైచేయి సాధించింది.

# మిమ్మల్ని చూసి ఇండియా గర్విస్తోంది

## జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా


**హైదరాబాద్:** పారిస్ పారాలింపిక్స్‌లో సత్తాచాటిన భారత అథ్లెట్ల టీమ్‌ను జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా అభినందించారు. '2024 పారాలింపిక్స్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. 29 పతకాలతో స్వదేశానికి తిరిగి వచ్చిన టీమ్‌లో ఉన్న భారత అథ్లెట్ల బృందానికి, సహాయక సిబ్బందికి నా అభినందనలు. మిమ్మల్ని చూసి ఇండియా గర్విస్తోంది' అని ట్వీట్ చేశారు. నీరజ్ ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే.




# 29 పతకాలతో 18వ స్థానంలో భారత్

## - ముగిసిన పారా ఒలింపిక్స్
## 220పతకాలతో టాప్‌లో చైనా

**పారిస్:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఆగస్టు 28న ప్రారంభమైన 17వ పారా ఒలింపిక్ పోటీలు సెప్టెంబర్ 8 రాత్రి స్టెడ్-డి జాతీయ స్టేడియంలో జరిగిన ముగింపు ఉత్సవాలతో ముగిసాయి. ఈ వేడుకల్లో త్రివర్ణ పతకాన్ని ప్రీతిపాల్-హర్వీందర్ సింగ్ చేబూని భారత బృందం ముందు నడిచారు. ముగింపు వేడుకల్లో ఆతిథ్య ఫ్రాన్స్ జాజ్ సంగీతం, సాంప్రదాయ నృత్యాలు, ప్రముఖుల ప్రసంగాలతో పాటు అద్భుత ప్రదర్శనలు, అబ్బుర పరిచే లేజర్ షో ఆకట్టుకున్నాయి. ఆర్చరీలో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన హర్వీందర్ సింగ్, స్ప్రింట్‌లో రెండు పతకాలు సాధించిన ప్రీతిపాల్ భారత పతకాన్ని తమ భుజాలపై మోసారు. 2024 పారా ఒలింపిక్స్ లో మొత్తం 170



దేశాలనుంచి 4,463మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించగా.. 22 క్రీడాంశాలకు సంబంధించి మొత్తం 549ఈవెంట్స్ జరిగాయి. ఎప్పటిలాగే ఈ పారా ఒలింపిక్స్‌లోనూ చైనా తన ఏకచక్రాధిపత్యాన్ని ప్రదర్శించింది. భారత్ కూడా అంచనాలకు మించి రికార్డు పతకాలతో సత్తా చాటింది. 2024 పారా ఒలింపిక్స్‌లో చైనా 94స్వర్ణ, 76రజత, 50 కాంస్యాలతో సహా 220పతకాలతో అగ్రస్థానంలో నిలువగా.. బ్రిటన్ 49స్వర్ణ, 44రజత, 31 కాంస్యాలతో సహా 124, అమెరికా 36స్వర్ణ, 42రజత, 27కాంస్యాలతో కేవలం 105పతకాలతో 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఈ ఒలింపిక్స్‌లో 170దేశాల అథ్లెట్లు పతకాలు కోసం పోటీపడగా కేవలం 85దేశాలకు మాత్రమే పతకాలు దక్కాయి. లిథూనియా, లక్సెంబర్గ్, మోంటెనెగ్రో, మారిషస్, నేపాల్, పాకిస్తాన్, వియత్నాం ఒక్కో కాంస్య పతకాలు దక్కాయి. ఇవన్నీ 79వ స్థానంలోనే నిలిచాయి. 17వ పారా ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు అంచనాలకు మించి రాణించారు. టోక్యో ఒలింపిక్స్‌లో సాధించిన అత్యధిక పతకాల రికార్డు(19)ను పారిస్ ఒలింపిక్స్‌లో అధిగమించారు. 2024 పారా ఒలింపిక్స్‌లో భారత్ 7స్వర్ణ, 9రజత, 13కాంస్యాలతో సహా ఏకంగా 29 పతకాలు సాధించి రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో ఏకంగా టాప్-20లో చోటు దక్కించుకుంది. 2021 టోక్యో పారా ఒలింపిక్స్ పతకాల పట్టికలో 24 స్థానంలో నిలిచిన భారత్.. ఈసారి ఏకంగా 18వ స్థానానికి ఎగబాకింది. 2024 పారా ఒలింపిక్స్ ముగియడంతో 2028 పారా ఒలింపిక్స్ ఆతిథ్య దేశమైన లాస్‌ఏంజెల్స్ నిర్వాహకులకు అంతర్జాతీయ పారా ఒలింపిక్స్ కమిటీ నిర్వాహకులు కవాతును అందజేశారు.



## విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 2,10000 /- విరాళం

**చిత్తూరు -సూర్య వాస్తవం :** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం గుడిపాల మండలంకు చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వెలుగు సంఘం వారు మరియు చౌక దుకాణ డీలర్లు కలిసి 2,10000 /- రూపాయలను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న జి.జే.యం. చారిటబుల్ ఫౌండేషన్కు విరాళంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడిపాల మండలంకు చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వెలుగు సంఘం వారు మరియు చౌక దుకాణ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా
## వినాయకుడి నిమజ్జనం

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో గత మూడు రోజుల నుండి వినాయక ఉత్సవాలను వీధి వీధినా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు కావడంతో పురవీధుల్లో ఉండే వినాయకుడు బ్రాహ్మణ వీధి. తలవాలకట్ట. బెస్త వీధి. కాగితాల మకాణం. పామిడి అమ్మ వీధి. మెయిన్ బజార్. వినాయకులు చూడడానికి భక్తులు వందల సంఖ్యలో వినాయక ఉత్సవాల్లో పాల్గొన్నారు అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఊరేగింపుగా పెన్నా నదిలో నిమగ్నానికి తరలి వెళ్లినాయి. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి వందల సంఖ్యలో చాలామంది భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు.



## సిద్ధి వినాయక ఆలయం వద్ద చిన్నారుల జానపద కోలాట నృత్యాలు



**హిందూపురం టౌన్ -సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సిద్ధి వినాయక ఆలయం వద్ద చిన్నారుల చే నిర్వహించిన జానపద కోలాట నృత్యాలు పలువురి ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా వేదమంత్రాలు నడుమ శ్రీ సిద్ధి వినాయక విగ్రహానికి అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు, స్వామివారిని ప్రత్యేక అలంకారణలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శ్రీ రామాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్లపురం జానపద సంగీత దర్శకుడు అశ్వర్థ నారాయణశిష్య బృందం చే ఆటపాటలచే కోలాటం నృత్యాలు నిర్వహించారు చిన్నారులు ఎంతో నైపుణ్యముతో నిర్వహించిన కోలాట నృత్యాలు పలువురిని అలరింప చేశాయి ఈ కార్యక్రమంలో సిద్ధి వినాయక దేవాలయం, శ్రీ రామాలయ ట్రస్ట్ సభ్యులు ఎం ఓ నరసింహప్ప వెంకటేశ్వర శెట్టి ప్రముఖ కళాకారుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎం.బి పల్లి వినాయకుడి నిమజ్జన వేడుకలు

### - నిమజ్జనంలో పాల్గొన్న ఉపసర్పంచ్ హరి

**అనంతపురం - సూర్య వాస్తవం :** ఆలమూరు మండలంలోని ఎండి పల్లి స్థానిక ఎస్సీ కాలనీ లో గత మూడు రోజుల నుండి వినాయక ఉత్సవాలను ఉప సర్పంచ్ హరి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు కావడంతో ఉప సర్పంచ్ హరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడు కరుణ కటాక్షలు గ్రామ ప్రజలందరికీ పై చూపాలని కోరారు. అనంతరం అంగరంగ వైభవంగా నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని ఊరేగింపుగా నిమజ్జనం చేశారు.



# అభివృద్ధి పనుల్లో ఎక్కడా తేడా రాకూడదు

**- గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలి- రైతులు సాగు చేసిన ప్రతి ఎకరానికి ఈ-క్రాప్ కావాలి**
**- పార్టీ నాయకులకు ఎమ్మెల్యే పరిటాల సునీత దిశా నిర్దేశ్యం- ఎక్కడ లోటు పాట్లు ఉన్నా.. నా దృష్టికి తీసుకురావాలని ఆదేశం**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** రాప్తాడు నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ తేడా ఉన్నా.. ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రేషన్ పంపిణీ, పంటల సాగు తదితర అంశాల గురించి ఆరా తీశారు. గ్రామాల్లో నిర్మించబోయే సీసీ రోడ్లు, ఇతర పనుల విషయాలపై ఆరా తీశారు. ఎక్కడైనా సరే లోటు పాట్లు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడ సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం పొలం పిలుస్తోంది ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. రైతులు ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారు.. ఈ క్రాప్ నమోదు వంటి అంశాల మీద దృష్టి సారించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి ఎప్పటి కప్పుడు తెలియజేయాలన్నారు. మరోవైపు గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ రేషన్ సక్రమంగా అందాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు ఉండకూడదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో మన పార్టీని గెలిపించారని.. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉందని నాయకులతో సునీత అన్నారు.



### వరద బాధితులకు పట్టణ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు,
# ప్రభాస్ అభిమానులు చేయూత ...

### - నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాల సహాయం

**పత్తికొండ టౌన్- సూర్య వాస్తవం:** ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వసం కోల్పోయిన విజయవాడ వరద బాధితుల కు తమ వంతు చేయూత నివ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో వరద బాధితులకు సహాయార్థంగా పట్టణ టైలర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రభాస్ అభిమానులు నిత్యావసర వస్తువులు, బియ్యం, మంచి నూనె పాకెట్లు, నూతన వస్త్రాలను సిపిఐ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా బి. గిడ్డయ్య మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా మునుపెన్నడులేని విధంగా విజయవాడ నగర ప్రజలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, వరద బాధితులకు తమ వంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వరద బాధితులకు సహాయం అందించిన వస్తువులను తమ పార్టీ ద్వారా బాధితులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పి. భీమ లింగప్ప, మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్ ఈరన్న, మండల సహాయ కార్యదర్శి రంగన్న, టైలర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రభాస్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.






### నూతన సిఐని కలిసిన
## బలిజ సంఘం నాయకులు

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణ సీఐగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ ని బలిజ సంఘం నాయకులు పామిడి పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బలిజ సంఘం నాయకులు సిఐని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమార్కుల పాలిట సింహ స్వప్నంగా మారి, అసాంఘికశక్తుల భరతంపట్టి, పామిడి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకై కృషిచేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. సీఐ యుగంధర్ మాట్లాడుతూ.... అన్నివర్గాలను కలుపుకుని ప్రజల అండదండలతో పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠినచర్యలు తీసుకుంటామని, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తామని, సామాన్య ప్రజ లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలియజేస్తూ, తనకు శుభాకాంక్షలు తెలియజేసిన బలిజ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కత్రిమల సుబ్బు,పసుపులేటి సురేష్, మధు, టీ. నాగరాజు,ఎన్. రవీంద్ర,సంపత్,కేశవ,రమేష్,ఏ. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులను గౌరవించాలి

**ప్రొద్దుటూరు -సూర్య వాస్తవం:** ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని న్యాయవాది సుమంత్ కుమార్ తెలిపారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం లో తన పుట్టినరోజు సందర్భంగా న్యాయవాది సుమంత్ కుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని, వృద్ధులను నిర్లక్ష్యం చేయకూడదు అని వివరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో న్యాయవాదులు బాలాజీ, దినేశ్ పాల్గొన్నారు.



## వైభవంగా గణేష్ నిమజ్జనం..!

### - మండలంలో 92 విగ్రహాలు నిమజ్జనం
### - కె.సి.కెనాల్ ,తెలుగుగంగ, కుందునది వద్ద నిమజ్జన ఉత్సవం



**దువ్వూరు-సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన దువ్వూరు కేసీ కెనాల్ వద్ద ,కుందూనది వద్ద, చల్లబసాయపల్లె సమీపంలోని తెలుగంగ డ్యాం వద్ద సోమవారం వైభవంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. దువ్వూరు పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రాంతాల నుంచి భారీస్థాయిలో నిమజ్జనానికి గణేష్ విగ్రహాలు వచ్చాయి. అయా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తీసుకు వెళ్లి అక్కడ కేసీ కెనాల్ లో, కుందూ నది వద్ద, తెలుగు డ్యామ్ లో నిమజ్జనం చేసిన తర్వాత ఆ వాహనాలను అక్కడ నుంచి అయా ప్రాంతాలకు వెళ్లే విధంగా అధికా రులు చర్యలు చేపట్టారు. అటు మండల తహశీల్దార్ మధురవాణి, ఎంపీడీవో శివప్రసాద్ ల ఆధ్వర్యంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, దువ్వూరు పోలీసులు గణేష్ నిమజ్జనాన్ని పర్యవేక్షించారు. నిమజ్జనానికి దూరమున పిల్లలను, మద్యం సేవించిన వారిని నిలిపి వేసి కొద్ది మందిని మాత్రమే విగ్రహాల వెంట పోవడానికి అనుమతించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జనం జరిగే చోట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వినాయక చవితి మూడో రోజు కావడంతో అధిక సంఖ్యలో నిమజ్జనానికి గణేష్ విగ్రహాలు వచ్చాయి. ఎంతో వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండలంలో 92 విగ్రహాలు నిమజ్జనం చేశారు. దువ్వూరు మండలంలోని గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ఏదిఏమైనా వినాయక చవితి ఉత్సవాలు అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా జరిగాయని అయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



# తల్లి చెంతకు తరలిన గణనాథుడు

## - మేళతాళాలతో సాగిన గణేశ నిమజ్జనోత్సవం



ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని వాడవాడలా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ రూపాలలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు దూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించి, సోమవారం మూడవ రోజు సందర్భంగా ఆయన తల్లి గంగాదేవి చెంతకు తరలించారు. విగ్రహాల మండపం వద్ద ఉట్టి కొట్టడం, అన్నప్రసాద వితరణ నిర్వహించి, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా వినాయక విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించి, కేరింతలతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. కాగా నిమజ్జనోత్సవం సందర్భంగా నిమజ్జనం నిర్వహించే కామనూరు, కెసి కెనాల్, తదితర ప్రాంతాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎస్సార్ఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే



ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: స్థానిక సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రెషర్స్ డేను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి వుండి, తమ తోటి విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలని, కళాశాల నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని సూచించారు. ఈ సంధర్భంగా సీనియర్ విద్యార్థులు వారి జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికి, అధ్యాపకుల పట్ల గౌరవంగా మెలిగి, సీనియర్ల సమన్వయంతో ముందుకు సాగి కళాశాల ఖ్యాతిని మరింత పెంచాలని వివరించారు. కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొల్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అమ్మో వరాహం...

## - వర్షాకాలంలో ఇళ్ల మధ్య పందుల సంచారంతో ప్రజల భయాందోళనలు
## - అధికారులు స్పందించాలని కోరుతున్న ప్రజలు



ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: అమ్మో వరాహం... అంటూ ప్రొద్దుటూరు వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఇళ్ల మధ్య పందుల సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుకుంటున్నారు. వివరాల్లోకెళితే.... ప్రొద్దుటూరు పట్టణంలో వరాహాల సంచారం ఇటీవల అధికమైందని ప్రజలు తెలుపుతున్నారు. అసలే వర్షాకాలం, ఇటీవల అధిక వర్షాలు, రోడ్లపై నీరు నిలవడం గమనిస్తూనే వున్నాం.. అసలే అపరిశుభ్ర వాతావరణం, ప్రజలు, పారిశుధ్య కార్మికులు ఒకవైపు సరిదిద్దుకుంటుంటే ఊరికి దూరంగా సంచరించే పందులు ఇళ్ల మధ్యలో సంచరిస్తూ అపరిశుభ్ర వాతావరణం నెలకొల్పు తున్నాయని విమర్శిస్తున్నారు. విష జ్వరాలు భయంతో ఒకవైపు వుంటే ఈ పందుల సంచారం వలన స్వైన్ ఫ్లూ, మెదడు వాపు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. కావున సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, పందుల యజమానులు వాటిని ఇళ్ల మధ్యలో సంచరించకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు 'మత్తు' వదిలి స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

# ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రైల్వే కోడూరు –సూర్య వాస్తవం: రైల్వే కోడూరు నియోజకవర్గంలో పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామంలో తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల బృందం ఆదివారం ఉచిత సేవల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు శాసనసభ్యుల అరవ శ్రీధర్, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి తనయుడు యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి క్యాంపులు పేద ప్రజలందరికీ ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు అరవ శ్రీధర్ తో పాటు ఐదు మండలాలకు చెందిన టిడిపి జనసేన బిజెపి నాయకులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపానం, అశ్లీల వెబ్సైట్లు,

# గంజాయి, డ్రగ్స్‌ను నిషేధించాలి: ఎంపీజే

ప్రొద్దుటూరు–సూర్య వాస్తవం: మద్యపాన నిషేధం స్త్రీలపై అత్యాచారలకు కారణమవుతున్న అశ్లీల వెబ్సైట్లు, గంజాయి, డ్రగ్స్ ను నిషేధించాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య మరియు ఆరోగ్య సమస్యలపై సెప్టెంబర్ 1 నుంచి 15 తేది వరకు ఉద్యమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందుగా ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుతం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు గ్రామీణ, ఏరియా, హాస్పిటల్స్ లో రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పిస్తూ అర్హులైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా, మెరుగైన సేవలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవితాలను, ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసే మద్యపాన నిషేధం స్త్రీలపై అత్యాచారలకు కారణమవుతున్న అశ్లీల వెబ్సైట్లు, గంజాయి, డ్రగ్స్ ను నిషేధించాలని కోరారు. పంచాయితీ, మున్సిపల్, కార్పొరేషన్లలో పరిశుభ్రతను పాటించేలా, మౌలిక సదుపాయాలను కల్పించేలా రాష్ట్రంలోని మెడికల్ షాపులలో నిషేధిత, ఎక్స్పైర్ అయిన మందుల విక్రయాలను జరిపే వారిపై సంబంధిత డ్రగ్స్ ఇనిస్పెక్టర్లను నిఘా ఉంచాలని ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హెూటల్స్, స్వీట్, బేకరీ షాప్ లపై, కాలం చెల్లిన తినుబండరాలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పరిశీలించి చర్యలు తీసుకునేలా ఫుడ్ ఇన్స్పెక్టర్లను నిఘా ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలకు కారణం అవుతున్న నకిలీ విత్తనాలు, మందులు




అమ్మేవారి పట్ల కఠిన చర్యలు తీసుకునేలా వ్యవసాయ అధికారులను జాగృతి చేసి అలాంటి షాపులపై చర్యలు తీసుకోవాలని పై సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ద్వారా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష, కార్యదర్శి మహమ్మద్ రఫీ, కోశాధికారి ఇస్మాయిల్, అసలం జమాతే ఇస్లాం హింద్ సభ్యులు మొహిద్దిన్, పట్టణ అధ్యక్షుడు షఫీ వుల్లాహ్, అల్లా బకాష్, బాదుల్లాహ్ తదిరులు పాల్గొన్నారు.

## చీకటి పడక ముందే

# వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేలా చూడాలి

## - ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పొద్దుటూరు–సూర్య వాస్తవం: సాధ్యమైనంతవరకు చీకటి పడక ముందే వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని కామనూరుకుందు నది వంతెన వద్ద ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జన బందోబస్తును పరిశీలించారు. ప్రొద్దుటూరు డిఎస్పి భక్తవత్సలంతో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటుచేసిన బందోబస్తు పై చర్చించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సాధ్యమైనంతవరకు చీకటి పడక ముందే వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేలా చూడాలని సూచించారు. నిమజ్జనానికి వెళ్ళే వాహనాల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు లేకుండా చూడాలన్నారు. మద్యం సేవించి నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన కుండా పోలీసు అధికారులు తగు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. కుందూ నదిలో నీరు ఎక్కువగా పారుతున్నందున నదిలోకి ఎవరు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.



కుందునది వద్ద గజ ఈతగాళ్ళు, అగ్నిమాపక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీతో పాటు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్సై మహమ్మద్ రఫీ ఉన్నారు.

# గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

## - ఎంపీపీ రాజేంద్రనాద్ రెడ్డి

వీరబల్లి– సూర్య వాస్తవం: గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి అని వీరబల్లి మండల అధ్యక్షుడు రాజేంద్రనాధ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వీరబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ప్రతి నెల 9 వ తేదీన రాజేంద్రనాద్ రెడ్డి సహకారంతో పౌష్టికాహారం అందచేయడం సంతోషకరమని విఆర్డీఎస్ సురేంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీపీ రాజేంద్రనాద్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా చికిత్స కోసం ప్రతి నెల వస్తున్న గర్భిణులకు బోజనాలను ఏర్పాటు చేస్తున్నామని దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భవతులు ఆహారం కోసం ఇబ్బందులు పడుతు ఒడడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.మరింత మంది దాతలు ముందుకు వచ్చి



ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జియా ఉల్లా, సుకుమార్, కల్పన, వెంకటకృష్ణ,మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువలపై

# అక్రమ నిర్మాణాలను తొలగించాలి...

## - వార్డు మెంబర్ లింగన్న

పత్తికొండ టౌన్–సూర్య వాస్తవం: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి పాత ఊరివాకిలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని 7వ వార్డు సభ్యులు ఎం. లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం నాడు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా రోడ్లు వెడల్పు చేపట్టడం జరిగిందన్నారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపార దుకాణదారులు డ్రైనేజీ కాలువలపై అక్రమ



కట్టడాలు చేపట్టి రేకుల షెడ్లు వేసుకొని ప్రధాన రోడ్డు వరకు రావడంతో ట్రాఫిక్ సమస్య మరల మొదటికొచ్చిందన్నారు. ప్రధాన రహదారిలో ఆవులు విచ్చలవిడిగా సంచరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ఈ విషయమై గ్రామపంచాయతీ ఈవో నరసింహులు కలుగజేసుకొని అది పోలీసు వారి పని, మా పరిధి లో లేని అంశమని సమాధానం ఇచ్చారు.

**పందుల యజమానులకు గ్రామపంచాయతీ ఈవో నరసింహులు హెచ్చరిక ....**

పట్టణంలోని పందులు పెంపకం చేసే యజమానులకు గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా పందులు సంచరించడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, నిబంధనల ప్రకారం పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందుల పెంపకం షెడ్లు వేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆదేశానుసారం మూడు రోజులలోపు పందులను ఊరి బయటకు తరలించకపోతే, గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా పందులను తరలిస్తామని హెచ్చరించారు.

## రాజీనామాలు సరే...

# చేరేదెప్పుడు

**ఏలూరు-సూర్య వాస్తవం:** వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో కొందరు ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవితో పాటు వైసీపీ ప్రాధమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. అయితే పార్టీలో ఇంత వరకూ చేరలేదు. వైసీపీ నుంచి పోతుల సునీతతో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావులు రాజీనామా చేశారు. రాజీనామా చేసి పది రోజులు దాటుతున్నా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకోలేదు. అందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు.బీద మస్తాన్‌రావు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ పోతుల సునీత విషయంలో మాత్రం స్థానిక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ క్యాడర్ పెద్దయెత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోతుల సునీత టీడీపీలో ఉండేవారు. పోతుల సునీత భర్త పోతుల సురేష్ పరిటాల రవి అనుచరుడు. ఆమెకు తెలుగుదేశం పార్టీలో గతంలో మంచి ప్రాధాన్యత ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చి ఆమెకు ప్రయారిటీ ఇచ్చారు. కానీ 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోతుల సునీత టీడీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి వైసీపీలో చేరారు. వైసీపీలో పోతుల సునీతకు మంచి ప్రాధాన్యత ఇచ్చారు. మహిళ అధ్యక్షురాలిగా నియిమించారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అయితే తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే తనకున్న పరిచయాలతో ఆమె టీడీపీ అధినాయకత్వంలో కొందరికి దగ్గరయ్యారు. దీనికి తోడు టీడీపీకి కూడా శాసనమండలిలో ఎక్కువ మంది సభ్యుల మద్దతు, బలం అవసరం. అందువల్ల రాజీనామా చేసి రావాలని కోరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా పదవులకు రాజీనామా చేసి రావాలని, అయితే ట్రాక్ రికార్డు ను బట్టి పార్టీలో చేసుకుంటామని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ఆయన మనసులో మాట అర్థమయింది.వైఎస్ జగన్ పార్టీలో చేర్చుకోవద్దంటూ... పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ టీడీపీ సీనియర్ నేతలు కూడా చంద్రబాబుపై వత్తిడి తెస్తున్నారు. దీంతో ఆమె చేరిక విషయం పెండింగ్ లో పడినట్లయింది. అసలు పార్టీలో చేర్చుకుంటారా? చేర్చుకుని తిరిగి ఎమ్మెల్సీ పదవి ఇస్తారా? అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతుంది. ఇక రేపల్లెకు చెందిన మోపిదేవి వెంకటరమణ పరిస్థి?తి కూడా అంతే. రేపల్లెలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ వర్గం ఆయన చేరికను అడ్డుకుంటోందంటున్నారు. మోపిదేవికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ప్రచారం జరిగింది. అదే జరిగితే రేపల్లెల్లో నియోజకవర్గంలోని టీడీపీలో మళ్లీ గ్రూపులు మొదలవుతాయన్న ఆందోళన వ్యక్తమవుతుంది. మొత్తం మీద రాజీనామా చేసినా ఫలితం దక్కడం లేదని వైపీపీకి రాజీనామా చేసిన నేతలు ఆవేదన చెందుతున్నారు

# ఈఎన్‌ఏలను జీఎస్‌టీ నుంచి తొలగించాలి

## - రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** మద్యం తయారీలో వినియోగించే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్‌ఎ)ను జిఎస్‌టి పరిధి నుంచి మినహాయించి, రాష్ట్ర పన్నుల పరిధి (వ్యాట్)లోకి కొనసాగించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. సోమవారం నాడిక్కడ జరిగిన 54వ జిఎస్‌టి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీమాపై జిఎస్‌టిని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని, వృద్ధులు, మానసిక వికలాంగులకు బీమాపై జిఎస్‌టిని పూర్తిగా మినహాయించాలని కోరారు. పర్యావరణ హితాన్ని పెంపొందించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే విధంగా, ఆ రంగంలో ఉపయోగించే విడి భాగాలపై ఉన్న జిఎస్‌టిని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌లపై ఉన్న పన్నును సరళీకరించి, తగ్గించాలని ప్రతిపాదించారు. ఎపిసిఒఎస్ ద్వారా నిర్వహించే అవుట్ సర్వీస్ సేవలపై జిఎస్‌టి మినహాయించాలన్నారు. జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 16(4) అమలులో ఉన్న ఇబ్బందులను తొలగించి, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. విద్యా సంస్థలు, యూనివర్సిటీల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహించేలా, ఆయా సంస్థలకు వచ్చే గ్రాంట్లపై ఉన్న జిఎస్‌టిని తొలగించాలన్నారు. వచ్చే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించాలని కోరారు.

# కొల్‌కతా పోలీస్ కమిషనర్‌ను తొలగించాలి

**కొల్‌కతా-సూర్య వాస్తవం:** ఆర్‌జి కర్ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేయాలని, కొల్‌కతా పోలీస్ కమిషనర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో లాల్‌బజార్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద సిపిఎం సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనను అడ్డుకోవడానికి బెంటింక్ స్ట్రీట్ వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ సిపిఎం నాయకులు, కార్యకర్తలు వాటిని దాటుకుని పెద్ద సంఖ్యలో లాల్ బజార్‌కు చేరుకున్నారు. దీంతో ఈ ప్రదర్శనలో పాల్గొన్న 14 మంది పార్టీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి తమ సహచరులను వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు ఆందోళనను కొనసాగిస్తున్నారు.

# ఏజెన్సీలో వర్ష బీభత్సం

❖ ఉగ్రరూపం దాల్చిన వాగులు ❖ వందలాది గ్రామాలకు రాకపోకలు బంద్
❖ కొండచరియలు విరిగిపడి ఒకరు మృతి ❖ మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు

**విజయవాడ-సూర్య వాస్తవం**



అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో, ఏజెన్సీ అంతటా వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పలుచోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. వందలాది గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా సరిహద్దు ప్రాంతాలు చివురుటాకులా వణికిపోయాయి. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో, విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలోని ఇళ్లపై కొండచరియలు విరిగిపడడంతో గిరిజన మహిళ కొర్ర కుమారి (35) మృతి చెందారు. ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ గ్రామంలో 30 ఇళ్లలో 120 మంది వరకూ జీవిస్తున్నారు. కొండచరియలు విరిగిపడడంతో గ్రామంలోనీ ఇళ్లన్నీ దెబ్బతిన్నట్టు సమాచారం. విద్యుత్ సరఫరా, సెల్ సిగల్స్ నిల్చిపోవడంతో బాహ్య ప్రపంచానికి విషయం ఆలస్యంగా తెలిసింది. మృతురాలి కుటుంబానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ ఘటన పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాల నుంచి కిందకు నీరు విడుదల చేయడంతో చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 38 అడుగులు నమోదైంది. ప్రమాదకర స్థితికి చేరువగా ఉంది. డొంకరాయి డ్యామ్ నుంచి ఆదివారం రాత్రి 11 గేట్లను ఎత్తి లక్షా పది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలైన సూరన్నగొంది, మధుకూరు తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షాలకు చింతూరు మండలంలోని సోకిలేరు వాగు మళ్లీ ప్రమాదకర స్థాయికి పెరిగింది. కుమ్మూరు వాగు, కొయగూరు వాగు, చంద్రవంక తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మారేడుమిల్లి, సీలేరు, కాకినాడ, రాజమండ్రి, విశాఖ తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులను రద్దు చేశారు. డొంకరాయి, సీలేరు ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేయడంతో శబరి పరివాహక ప్రాంతాలైన విఆర్.పురం మండలం చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, అడవి వెంకన్నగూడెం, సోపల్లి గ్రామాల చుట్టూ వరద చేరింది. అన్నవరం-ఉమ్మడివరం మధ్య లోలెవెల్ బ్రిడ్జి పైనుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో సుమారు 40 గ్రామాలకు నాలుగు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. పోలవరం ముంపు మండలాల్లో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. జికె.వీధి మండలంలో 16 పంచాయతీల్లో పంట పొలాలు నీట మునిగాయి. హుకుంపేట మండలం చీడుపుట్టు, దిగుమొదపుట్టులలో కల్వర్టుల పై నుంచి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. డుంబ్రిగుడ మండలం గుంటసీమ, రంగిలిసింగి తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. ముంచంగిపుట్టులోని జోలాపుట్, డుడుమ జలపాతాలు ప్రమాదకరంగా మారాయి. ఉరకగెడ్డ నీరు ఎక్కువగా రావడంతో అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం మామిడిపాలెం గ్రామ గిరిజనులు జల దిగ్బంధంలో చిక్కుకుపోయారు. గొలుగొండ మండలం బొడ్డేరు, దారగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

**మాచ్‌ఖండ్‌లో నిల్చిన విద్యుదుత్పత్తి**

ఎపి-ఒడిశా సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న నాలుగు యూనిట్లలోనూ విద్యుదుత్పత్తిని నిలిపి వేశారు. డి-వాటరింగ్ పంపుల ద్వారా నీటిని బయ టకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్ కేంద్రం టర్బైన్‌లోకి నీరు వెళ్లడంతో యూనిట్లు పాడయ్యే అవకాశముందని, ఇదే జరిగితే కోట్లాది రూపాయల నష్టం వాటిల్లనుందని అధికారులు చెప్తున్నారు.

**తాటిపూడి రిజర్వాయర్ దిగువ ప్రాంతంలో అలెర్ట్**

వేగావతి నది ఉధృతికి విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని పారాది కాజ్‌వే కొట్టుకు పోయింది. బొబ్బిలి మున్సిపాలిటీలోని పూల్ బాగ్ రోడ్డు చెరువును తలపిస్తోంది. బలిజిపేట రోడ్డులో యుద్ధ స్తంభం వద్ద రోడ్డుపై భారీ వృక్షం కూలిపోయింది. వేపాడ మండలం సోంపురం జంక్షన్ రైల్వే అండర్ బ్రిడ్జి దిగువ నుంచి వెళ్లే మార్గం వర్షపు నీటితో ఉండడంతో మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లబెల్లి గ్రామంలోని అనంత చెరువుకు ఆదివారం అర్ధరాత్రి గండి పడింది. తాటిపూడి రిజర్వాయర్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ పరిశీలించారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మడ్డువలస ప్రాజెక్టును పరిశీలించారు.

### కవిటిలో 95.4 మిల్లీమీటర్ల వర్షపాతం

శ్రీకాకుళం జిల్లాలో గత 24 గంటల్లో 10.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కవిటిలో 95.4 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో పాతపట్నం మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

# నవంబరులో ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై జిఎస్‌టి తగ్గింపు?

## - మంత్రుల బృందానికి నివేదన - జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**




ఆరోగ్యం, జీవిత బీమా ప్రీమియంలపై పన్ను రేటును 18 శాతం నుండి తగ్గించాలనే అంశంపై చర్చ కొలిక్కి రాకపోవడంతో దీనిని మంత్రుల బృందానికి (జిఒఎం) నివేదించారు. బహుశా నవంబరులో దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సోమవారం నాడిక్కడ జరిగిన 54వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం నవంబరులో జరగనుంది. ఈలోగా మంత్రుల బృందం దీనిని పరిశీలించి ఒక నివేదిక ఇస్తుందని, దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటా మని జిఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం నిర్మలా సీతారామన్ విలేకరులకు తెలిపారు. ఈ బీమా ప్రీమియంలపై జిఎస్‌టి తగ్గించే అంశంపై విస్తృత ఏకాభిప్రాయం ఉందన్నారు. గత పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు దీనిపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశాయి. కేంద్ర, రాష్ట్ర అధికారులతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీ కౌన్సిల్ సమావేశం కూడా ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జిఎస్‌టిని తగ్గించాలని డిమాండ్ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా ప్రీమియంలపై జిఎస్‌టి కేంద్రం, రాష్ట్రాలు రూ.8,262.94 కోట్లు వసూలు చేయగా, ఆరోగ్య రీ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై రూ.1,484.36 కోట్ల మేర జిఎస్‌టి వసూలు చేశాయి. కేదార్‌నాథ్ యాత్రలో వినియోగించే హెలికాప్టర్ సేవలపై జిఎస్‌టి 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. రైల్వే ఎయిర్ కండిషనర్లపై 28 శాతం పన్ను విధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టం ప్రకారం స్థాపించ బడిన విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల కోసం ఇచ్చే నిధులను జిఎస్‌టి పరిధి నుండి మినహాయించాలని డిమాండ్ రావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు. ఎంపిక చేసిన స్నాక్స్‌పై జిఎస్‌టి 18 శాతం నుండి 12 శాతానికి తగ్గించారు. కేన్సర్ ఔషధాలపై జిఎస్‌టి రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. నాప్‌కిన్స్‌పై 18 శాతం నుండి 12 శాతానికి తగ్గించారు. కార్ సీట్లపై జిఎస్‌టి రేట్లను 18 శాతం నుంచి 28 శాతానికి పెంచినట్లు కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజరు మల్హోత్రా తెలిపారు.కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రులు జిఎస్‌టి పరిహారం సెస్‌ను సమీక్షించాలని పట్టుబట్టారు. 'ఆరోగ్య బీమాపై జిఎస్‌టిని పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్య వ్యతిరేకించారు. రీసెర్చ్ గ్రాంట్లు పొందే విద్యా సంస్థలను జిఎస్‌టి పరిధిలోకి తేకూడదని ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు కోరుతున్నాయని ఢిల్లీ ఆర్థిక మంత్రి అతిషి చెప్పారు. ఉక్కుపై జిఎస్‌టి 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా డిమాండ్ చేశారు.

## రోజా రీ ఎంట్రీ...



**తిరుపతి-సూర్య వాస్తవం :** మాజీ మంత్రి ఆర్కే రోజా ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కనిపించకుండా పోయారు. ఆమె ఎక్కువగా చెన్నైలోనో, లేక కుటుంబ సభ్యులతో కలసి విదేశాల్లోనూ పర్యటిస్తూ కాలం గడిపేవారు. పుణ?య క్షేత్రాలను దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దాదాపు వంద రోజుల నుంచి ఆమె విజయవాడ వైపు కూడా రాలేదు. పార్టీ అధినేత జగన్ ను వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆర్కే రోజాపై అనేక రకమైన ప్రచారం జరిగింది. ఆమె తమిళనాడు రాజకీయాల్లోకి వెళుతున్నారని, హీరో విజయ్ పెడుతున్న పార్టీలో చేరి తమిళనాడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అందుకు తగిన విధంగానే ఆర్కే రోజా రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండటంతో నిజమేనని నమ్మిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్కే రోజాకు మంచి ప్రయారిటీ ఇచ్చారు. మంత్రి పదవి ఇవ్వకముందు నామినేటెడ్ పదవి ఇచ్చారు. అదే సమయంలో మంత్రి వర్గ విస్తరణలో ఆమెకు చోటు కల్పించి చిత్తూరు జిల్లా నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఆర్కే రోజాకు ఉందని జగన్ పార్టీ నేతలకు చెప్పకనే చెప్పారు. చిత్తూరు జిల్లాలో చాలా మంది ఆర్కే రోజాకు వ్యతిరేకమయినా జగన్ వారెవ్వరినీ లెక్క చేయకుండా మంత్రిపదవి ఇవ్వడంతో ఆమె మరింత రెచ్చిపోయారు. తన సొంత నియోజకవర్గంలోని నగరిలోనూ వైసీపీ నేతలను దూరం చేసుకున్నారు చివరకు ఎన్నికల సమయంలో అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులను జగన్ మార్చారు. ఐ ప్యాక్ టీం ఇచ్చిన నివేదికలను అనుసరించి అభ్యర్థులను మార్చారు. కొందరిని మరొక నియోజకవర్గాలకు పంపించి వేశారు. రోజాను కూడా నగరి నుంచి మారుస్తారన్న ప్రచారం జరిగింది. అయితే జగన్ మాత్రం చివరకు ఆర్కే రోజాకు నగరి టిక్కెట్ ను ఖరారు చేశారు. దీంతో ఆమె ఖుషీ అయ్యారు. ఆఖరుకు రోజా కు వ్యతిరేకంగా ఉన్న పార్టీ నేతలతో జగన్ స్వయంగా మాట్లాడి రోజా గెలుపునకు సహకరించాలని కోరారు. కానీ రాష్ట్రంలో కూటమి గాలి బలమైన గాలులు వీయడంతో ఆర్కే రోజా కూడా దారుణంగా గాలి భానుప్రకాష్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఆర్కే రోజా ఇప్పటి వరకూ జరిగిన ప్రచారానికి తెర దింపారు. తిరిగి రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని నిలదీశారు. ఇక విజయవాడ వరదల్లో ప్రభుత్వం అట్టర్ ఫెయిల్యూర్ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా షో చేయడం తప్ప బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. మొత్తం మీద ఆర్కే రోజా రాజకీయంగా యాక్టివ్ కావడం పట్ల క్యాడర్ లో సంతోషం కనపడుతుంది.

## ప్రకాశం బ్యారేజీ గేట్ల మరమ్మతులు పూర్తి

### - కన్నయ్య నాయుడికి సన్మానం

**విజయవాడ-సూర్య వాస్తవం:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తిన విషయం తెలిసిందే. అయితే వరదలో కొట్టుకొని వచ్చిన బోట్లు బలంగా తాకడంతో దెబ్బతిన్న బ్యారేజీ 67, 69, 70 గేట్ల మరమ్మతులు ఇవాళ (సోమవారం) పూర్తయ్యాయి. బ్యారేజీ వద్ద మరమ్మతు పనులు ముగిశాయి. ఇరిగేషన్ నిపుణుడు కన్నయ్య నాయుడు మార్గదర్శకత్వంలో బెకెమ్ ఇన్‌ఫ్రా సంస్థకు చెందిన ఇంజినీర్లు పనులు పూర్తి చేశారు. స్టీల్‌తో తయారు చేసిన భారీ కౌంటర్ వెయిట్లను ఇంజినీర్లు అమర్చారు. కాగా 5 రోజుల్లో మరమ్మతు పనులు పూర్తయ్యాయని అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో కీలక సూచనలు చేసిన నిపుణుడు కన్నయ్య నాయుడిని ఇంజినీర్లు సత్కరించారు. ఈ సందర్భంగా కన్నయ్య నాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారం, ప్రోత్సాహంతోనే పనులు త్వరగా పూర్తి చేశామని అన్నారు. ఏపీలో లక్షల ఎకరాల్లో పంటను కాపాడటం ఆనందంగా ఉందని, అన్నదాతలకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతో రేయింబవళ్లు కృషి చేసి మరమ్మతు పనులను పూర్తి చేశామని చెప్పారు. దెబ్బతిన్న ప్రకాశం బ్యారేజీ మూడు గేట్లు ఇప్పుడు సమర్థవంతంగా పని చేస్తున్నాయని కన్నయ్య నాయుడు చెప్పారు. తుంగభద్ర, ప్రకాశం బ్యారేజీ గేట్లకు మరమ్మతులు చేసి పంట పొలాలను రక్షించడం సంతోషం కలిగించిందని ఆయన వ్యాఖ్యానించారు.

# అడ్డంగా బుక్కైన నందిగం..!

**గుంటూరు-సూర్య వాస్తవం**



ప్రకాశం బ్యారేజ్‌కు కొట్టు కొచ్చి గేట్లను డ్యామేజ్ చేసిన బోట్లపై.. ఏపీ ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. వరద ప్రవాహంలో ఒకేసారి లంగర్లు వేసిఉన్న నాలుగు పడవలు కొట్టుకురావడంపై మొదట్లోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం దానిపై సీరియస్ అయ్యారు. తాజాగా ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు విచారణ ప్రారంభించారు. అవి ఫెర్రీ ఘాట్ వద్ద ఇసుక రవాణాకు వైసీపీ నేతలు వినియోగించిన బోట్లే అంటున్నారు. ఆ క్రమంలో బోట్లు ఉచ్చు మాజీ ఎంపీ నందిగం మెడకు చుట్టుకునే పరిస్థితి కనిపిస్తుంది. కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు అనుబంధంగా ఉండే కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. 64వ నంబరు గేటు వద్ద ఉండే వెయిట్ స్వల్పంగా దెబ్బతినగా.. 69వ గేటు వద్ద ఉండేది పూర్తిగా మధ్యకు విరిగిపోయింది. కాంక్రీట్ సిమెంట్ దిమ్మకు లోపల ఉండే ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. ఈనెల 2న కృష్ణా నదికి రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. అప్పుడు కొట్టు కొచ్చిన బోట్లలో ఒకటి 69వ గేటు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో విరిగిపోయి ఇరుక్కుపోయింది. ఈ బోటును ఢీ కొని మరో రెండు బోట్లు ఆగిపోయాయి. మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో స్వల్పంగా దెబ్బతింది. ఈ బోటూ అక్కడ ఇరుక్కుపోయింది. ఒకేసారి నాలుగు బోట్లు కొట్టుకురావడంపై మొదట్లోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సీరియస్ అయ్యారు. తాజాగా ఆ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ.. ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో.. విజయవాడ వన్ టౌన్ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. బోట్ల ఓనర్లని ప్రశ్నించబోతున్నారు. వేసిన లంగర్లు తెంపుకుని పడవలు ఎలా కొట్టుకుని వచ్చి గేట్లను ఢీకొన్నాయనే అంశంపై వివరాలు అడగనున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఫెర్రీ ఘాట్ నుంచే ఈ బోట్లు కొట్టుకుని వచ్చి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఆ బోట్లు వైసీపీకి చెందిన వారివే అని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతలు ఇసుక అక్రమ రవాణా కోసం ఆ పడవలు వాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకాశం బ్యారేజీ గేట్లను బోట్స్ ఢీకొన్న వ్యవహారంలో కుట్ర కోణం దాగి ఉందని.. దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టిన బోట్లు వైసీపీ నాయకులకు చెందినవిగా అనుమానాలు ఉన్నాయన్నారు. ఉద్దేశపూర్వకంగానే బోట్లతో ప్రకాశం బ్యారేజీని ఢీ కొన్నట్లు సమాచారం ఉందన్నారు? ప్రకాశం బ్యారేజిని డ్యామేజ్ చేయడానికి ఉద్దేశపూర్వకంగానే ఒకే చోట ఢీకొనే విధంగా చేశారని మండిపడ్డారు. ఇసుక తోలే హెవీ పడవలను తీసుకొచ్చి వదిలారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బ్యారేజీని ఢీ కొట్టిన పడవలకు ఎటువంటి అనుమతులు కూడా లేవని తెలుస్తుందని వాటికి వైసీపీ రంగులే ఉన్నాయని బ్యారేజీకి జరగరాని డామేజ్ జరిగి ఉంటే పెద్ద ఉపద్రవం వచ్చేదని దీన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాలని వ్యాఖ్యానించారు. మరోవైపు విజయవాడను ముంచెత్తిన బుడమేరు వాగు గండ్లను పూర్తిగా పూడ్చివేశారు . ఇప్పటికే రెండు గండ్లు పూడ్చివేసిన జలవనరుల శాఖ అధికారులు.. తాజాగా మూడో గండిని పూడ్చివేశారు. దీంతో దిగువ ప్రాంతాలకు వరద ప్రవాహం ఆగిపోయింది. అంతకుముందు మంత్రి నారా లోకేశ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో పనులు సాగాయి. బుడమేరు గండ్ల పూడ్చివేత పనులను పర్యవేక్షిస్తూ ఆరు రోజులుగా నిద్రాహారాలు మాని బుడమేరు గట్టుపైనే ఉన్న రామానాయుడు. అక్కడ పని పూర్తవ్వగానే ప్రకాశం బ్యారేజ్ గేట్లకు జరుగుతున్న రిపేర్లను ఆయన పర్యవేక్షించారు. అదలా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లను ఢీ కొట్టిన పడవుల యజమానుల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. గొల్లపూడికి చెందిన ఉషాద్రి, సూరాయపాలెం కు చెందిన కోమటి రామ్మోహన్ పడవులు గా గుర్తింపు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎంపీ నందిగం సురేష్ ఆధ్వర్యంలోనే ఈ పడవులు నడిచినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నందిగామ సురేష్ ఆధ్వర్యంలో మీ పడవలు నడుస్తున్నయా లేదా అనేది పోలీసులు ఇంకా ధృవీకరించలేదు.. కుట్ర కోణం వెలికి తీసేందుకు విచారణను పోలీసులు వేగవంతం చేస్తున్నారు .. దర్యాప్తు పురోగతిని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మొత్తానికి బోట్లను ఢీ కొట్టిన వ్యవహారాన్ని ప్రభుత్వం సీనియస్‌గా తీసుకోవడంతో అటు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో పాటు మరింత మంది వైసీపీ నేతల చుట్టూ ఉచ్చు గట్టిగానే బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది.

## ఆదిమూలంకు గుండెపోటు

**తిరుపతి-సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా కాకముందే ఆ పార్టీ ఎమ్మెల్యేలు అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇసుక దందాపై ధర్మవరం టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి సొంత పార్టీ నేతలపైనే ఆరోపణలు చేశారు. ఇక అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. తాజాగా టీడీపీ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఆదిమూలం తనను లైంగికంగా వేధించాడంటూ ఓ మహిళ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ లైంగిక వేధింపుల ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధిష్ఠానం ఆయనపై చర్యలకు ఉపక్రమించింది. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. ఇదిలా ఉంటే.. ఆదిమూలం సత్యవేడు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు వరలక్ష్మిపైనే లైంగికదాడి చేసినట్లు బాధితురాలే తెలిపింది. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించారని ఆరోపించింది. ఎమ్మెల్యే గురించి అందరికీ తెలియాలనే తాను పెన్ కెమెరాలో వీడియో తీశానని వెల్లడించింది. తనవద్ద బలమైన సాక్ష్యాలున్నాయనే ఆయన తనకు అనేకమార్లు ఫోన్లుచేశారని.. రాత్రిపూట మెసేజ్‌లు పెట్టి బెదిరిస్తున్నారని.. హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఆమె మీడియా సమక్షంలో వెల్లడించారు. ఇదే విషయమై పార్టీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ విషయాలన్నీ విధిలేని పరిస్థితుల్లో వెల్లడించాల్సి వస్తోందన్నారు. ఇద్దరం ఒకే పార్టీకి చెందిన వారం కావడంతో పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరం పాల్గొనే వారం. కొద్దిరోజులకు నా ఫోన్ నెంబర్ తీసుకుని పదేపదే ఫోన్లు చేయడం ప్రారంభించారని తెలిపింది. ఎన్నికలు ముగిసే వరకూ నన్ను సోదరిగా సంబోధించారు. ఆ తర్వాత ఆయన తన నిజస్వరూపం బయటపెట్టారని పేర్కొంది. ఆయనతో సన్నిహితంగా ఉండాలంటూ బెదిరింపులకు దిగారు. తమ మాట వినకపోతే భర్త, ఇద్దరు పిల్లల్ని చంపేస్తానని, పార్టీ పరంగా ఎలాంటి లబ్ధి చేకూరకుండా చేస్తాననే వారు అని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలతో పార్టీ అతనిపై చర్య తీసుకుంది. ఇదిలా ఉంటే సస్పెన్షన్ వేటు పడ్డ ఆదిమూలం తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆయనకు వైద్యులు స్టంట్ వేసినట్లు తెలుస్తోంది. ఆదిమూలం ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

### వైసీపీ హై కమాండ్ మౌనమే

ఏపీలో నేతల వ్యక్తిగత వ్యవహార శైలి వివాదాస్పదం అవుతోంది. ముఖ్యంగా కుటుంబ, వివాహేతర సంబంధాలు, వివాదాలు బయటపడుతున్నాయి. నిన్నటి వరకు వైసిపి నేతల వ్యవహార శైలి బయటపడింది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో విజయసాయి రెడ్డి వ్యవహారం బయటకు వచ్చింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మీడియా ముందుకు వచ్చారు. తన భార్య కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి ఎవరు అంటూ ప్రశ్నించారు. విజయసాయి రెడ్డి పై అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు విజయసాయిరెడ్డి. ఇదంతా మీడియా కుట్రగా అభివర్ణించారు. ఆ ఎపిసోడ్ ముగియగానే ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ వ్యవహారం బయటపడింది. మాధురి అనే మహిళతో సన్నిహితంగా ఉంటూ తమను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు పిల్లలు ఆరోపించారు. దువ్వాడ నివాసం వద్ద పక్షం రోజుల పాటు ధర్నా చేశారు. రోజుకో ట్విస్ట్ తో ఈ వివాదం నడిచింది. ఇది మరువకముందే ఎమ్మెల్సీ అనంత బాబు వీడియో కాల్ లో అసభ్యకర ప్రవర్తన వెలుగులోకి వచ్చింది. అయితే ఈ విషయాల్లో వైసిపి హై కమాండ్ పెద్దగా పట్టించుకోలేదు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు డిమాండ్ చేయడం, క్యాడర్ నుంచి కూడా విన్నపం రావడంతో వైసిపి అతనిపై చర్యలకు ఉపక్రమించింది. అయితే కేవలం ఇంచార్జ్ పదవి నుంచి మాత్రమే తప్పించింది. పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. అటు అనంత్ బాబు విషయంలో కూడా అదే జరిగింది. వైసీపీ హై కమాండ్ మౌనమే దాల్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలకు కీలక సూచనలు ఇచ్చారు. ప్రజలునమ్మకంతో బాధ్యత అప్పగించారని.. దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత మనపై ఉందని ఎమ్మెల్యేలకు హితబోధ చేశారు. అటు పవన్ సైతం చాలా రకాలుగా జాగ్రత్తలు చెప్పారు. వైసీపీ నేతల మాదిరిగా వ్యవహరించవద్దని కూడా సూచించారు. అయితే ప్రతి పార్టీలో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం సహజం. అందరూ వ్యక్తిగత వ్యవహార శైలిని పరిగణలోకి తీసుకోలేం కాబట్టి.. ఆరోపణలు వచ్చిన వెంటనే ఏ పార్టీ అయినా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఈ విషయంలో జగన్ వెనుకడుగు వేశారు. చంద్రబాబు ముందంజ వేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )